ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 09.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 290 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నేటి నుండి మహిళల ప్రీమియర్ లీగ్ 8

భారత్‌పై 500% సుంకాలు!

- బిల్లుకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్
- వచ్చే వారం సెనెట్‌లో ఓటింగ్
- రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతీకారం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 8: రష్యా నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న దేశాలపై 500 శాతం మేరకు సుంకాలను విధించడానికి అనుమతించే కొత్త బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదించారు. వచ్చే వారం సెనేట్‌లో ఓటింగ్ జరగనున్న ఈ బిల్లు ప్రభావం భారత్, చైనాపై ప్రధానంగా పడనున్నది. తెలిసి తెలిసీ రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న దేశాలను 500 శాతం మేరకు సుంకాలతో శిక్షించేందుకు అనుమతించే ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు ట్రంప్ బుధవారం పచ్చజెండా ఊపినట్లు రిపబ్లికన్ సెనేటర్ లిండ్‌సే గ్రాహమ్ ఎక్స్ పోస్టులో వెల్లడించారు. బుధవారం జరిగిన నిర్మాణాత్మక సమావేశం తర్వాత ట్రంప్ శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025 బిల్లుకు ట్రంప్ ఆమోదం తెలియచేసినట్లు గ్రాహమ్ తెలిపారు. ఈ బిల్లును వచ్చేవారం ప్రారంభంలో సెనెట్‌లో ఓటింగ్‌కు ప్రవేశపెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రాహమ్‌తోపాటు డెమోక్రటిక్ పార్టీ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంథల్ ప్రతిపాదించిన ఈ బిల్లుతో రష్యన్ చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సాగిస్తున్న యుద్ధానికి ఆర్థిక సహకారం అందచేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలను కట్టడి చేసేందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు గొప్ప అస్త్రం లభించగలదని దక్షిణ కరోలినా సెనేటర్ గ్రాహమ్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా నుంచి రష్యాకు ఇంధన ఉత్పత్తుల ఎగుమతి, ఇంధన రంగంలో పెట్టుబడుల నిషేధానికి కూడా ఉద్దేశించిన ఈ బిల్లుపై ఓటింగ్‌ను సెనేట్ వచ్చే వారానికి వాయిదావేసింది.

ప్రతీకార సుంకాలతో మొదలు..

చైనా తర్వాత రష్యా నుంచి చమురును అధికంగా దిగుమతి చేసుకుంటున్న రెండవ అతిపెద్ద దేశమైన భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై సుంకాలను పెంచడానికి ట్రంప్ సిద్ధపడిన నేపథ్యంలో ఈ బిల్లు సెనేట్ ముందుకు

...:: మిగతా 2లో

గాంధీభవన్ లో టీపీసీసీ నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం కృషిచేసి, ప్రభుత్వం ఏర్పాటుకు కృషిచేసిన కార్యకర్తల గెలుపు బాధ్యత ముఖ్యమంత్రిగా నా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు తీసుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకోసం గల్లీ గల్లీలో కాకుండా ఇంటింటి ప్రచారంలో సీఎం నుంచి ప్రతి ఒక్కరు భాగస్వాములు కానున్నారు.

మున్సిపోల్‌పై ఫోకస్

ఉమ్మడి జిల్లాలలో భారీ బహిరంగ సభలు.. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు నిర్వహణ

- ములుగు బహిరంగ సభకు సోనియా,రాహుల్, ప్రియాంకకు ఆహ్వానం
- మరో పక్క బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారాలపై ప్రజలకు వివరణ
- సభలు సక్సెస్ బాధ్యతలు కీలక నేతలకు అప్పగింత
- ఎంఎన్ఆర్ ఈ జీ ఎస్ పేరు మార్పుపై ఆందోళన
- మున్సిపోల్ లో గెలుపుపై ఎమ్మెల్యేలకు ర్యాంకులు
- ర్యాంకుల ఆధారంగానే పదవులు, టికెట్లు
- టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: అధికార కాంగ్రెస్‌పార్టీ పక్కా ఎన్నికల వ్యూహంతో ముందుకు సాగనుంది. ఓ పక్క రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పకడ్బందీ వ్యూహాన్ని రంచించిన సీఎం రేవంత్ రెడ్డి, మరో పక్క కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వీబీ జీ రామ్‌జీ చట్టాన్ని

...:: మిగతా 2లో

కూలీల పొట్టగొట్టేందుకే 'వీబీ జీ రామ్‌జీ' చట్టం

- తిరస్కరిస్తూ గ్రామ సభల్లో తీర్మానాలు చేయాలి
- కేంద్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం

...:: 2లో

గ్రీన్ ల్యాండ్ కొనేస్తాం: అమెరికా

డెన్మార్క్ దేశంలోని గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని కొనే దిశగా అమెరికా కసరత్తును ముమ్మరం చేసింది. దీనిపై ఆ దేశ ప్రభుత్వంతో చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వచ్చే వారం డెన్మార్క్ పర్యటనకు వెళ్లనున్నారు.

7

కోల్‌కతాలో ఐప్యాక్‌పై ఈడీ దాడులు

రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐ-ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తనిఖీలు చేశారు. కోల్‌కతాలోని ఆయన ఇంట్లో గురువారం ఈడీ అధికారులు సోదాలు చేశారు.

7

రోడ్డు భద్రతా విధానాల్లో విస్తృత మార్పులు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రవాణా అభివృద్ధి మండలి సమావేశంలో తెలంగాణ ప్రతిపాదనలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 8: తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహన ప్రోత్సాహం, వాహన స్క్రాపింగ్ విధానాలు, ఆటోమేటెడ్ ఫిట్నెస్ పరీక్ష కేంద్రాలు, డ్రైవింగ్ పరీక్షల ఆధునీకరణ వంటి విస్తృత మార్పులపై దృష్టి పెట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రవాణా మంత్రులతో రవాణా అభివృద్ధి మండలి 43వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్

...:: మిగతా 2లో

విద్యా వ్యవస్థలో సమూలాల మార్పులు

పేదలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ విధానం

సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన హిమాచల్‌ప్రదేశ్‌విద్యామంత్రి రోహిత్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి8 : రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్ ప్రదేశ్ మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం సచివాలయంలో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ

...:: మిగతా 2లో

ప్రమాదాల నివారణకు కార్లలో వైర్‌లెస్ వ్యవస్థ

రోడ్డు ప్రమాదాల నివారణకు వెహికిల్ టు వెహికిల్ (వీ2వీ) సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.

7

సమస్యల అధ్యయనానికి జాగృతి మరో 12 కమిటీలు

- మొత్తం 44 కమిటీలు ఏర్పాటు చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

...:: 2లో

పంట నష్ట నివారణకు రూట్ మ్యాప్

- ఆధునిక పరిజ్ఞానంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- సైలో ఆధారిత ధాన్యం నిలువకు మార్గాన్వేషణ
- ఆహార భద్రతను పెంపొందించడంతో పాటు పంట భద్రతకు ప్రణాళికలు
- పౌర సరఫరాల, భారత ఆహార సంస్థ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: చేతికొచ్చిన పంట భద్రతకోసం ఆధునిక పరిజ్ఞానంతో నిలువ చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందిస్తున్నామని, తద్వారా రైతుకు భరోసా కల్పించడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించడం సులభ తరమౌతుందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. యావత్ భారత దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణా రాష్ట్రం అగ్రగామిగా నిలుచుండడంతో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు.రైతు చేతికందిన ధాన్యాం నష్టపోకుండా ఉండేందుకు గాను

...:: మిగతా 2లో

గాంధీ కుటుంబాన్ని తిట్టిన రేవంత్‌ను దమ్ముంటే నిలదీయండి!

- రాహుల్ పై తాను చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన
- రేవంత్ రెడ్డి చేసిన దూషణలను మరిచిపోయి మా మీదే మాటలా?
- రేవంత్ రెడ్డి సోనియాను బలిదేవత అన్నది నిజం కాదా?
- కాంగ్రెస్ పై కేటీఆర్ ఫైర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ద్రోహాన్ని ప్రస్తావిస్తూ తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతున్న మాటలపై కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన రేవంత్ రెడ్డిని తీసుకువచ్చి ముఖ్యమంత్రిని చేసుకున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నేతలు మరిచిపోయారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీపై తాను చేసిన వ్యాఖ్యలు గతంలో రేవంత్ రెడ్డి అనేక సార్లు చేశారన్న విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇదే రాహుల్ గాంధీని రేవంత్ రెడ్డి "ముద్దపప్పు" అన్నాడని, అదే మాటను నేను రిపీట్ చేసినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి సోనియా గాంధీని "వెయ్యి మందిని బలి తీసుకున్న బలిదేవత.. తెలంగాణ పిల్లల్ని చంపింది" అని అన్నాడని, అలాంటి వ్యక్తిని పక్కన పెట్టుకొని తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నేతలు అభ్యంతరం చెప్పడంపై సానుభూతి వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబాన్ని రాహుల్ గాంధీని, సోనియా గాంధీని అడ్డగోలుగా తిట్టిన రేవంత్ రెడ్డిని పక్కన పెట్టుకొని మాలాంటి ప్రతిపక్ష నేతలపై మాట్లాడడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ముంటే రేవంత్ రెడ్డిపై

...:: మిగతా 2లో

ప్రతి కుక్కను తరలించాలని మేం చెప్పలేదు

వీధుల్లో ఉండే ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, జంతువుల జనన నియంత్రణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సుప్రీం కోర్టు పేర్కొంది.

7

సమస్యల అధ్యయనానికి
జాగృతి మరో 12 కమిటీలు

- మొత్తం 44 కమిటీలు ఏర్పాటు చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 8 : తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించబోయే బ్లూ ప్రింట్ లో భాగంగా మరో 12 కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 32 కమిటీలను ప్రకటించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం వాటికి అదనంగా మరో 12 కమిటీలు ఏర్పాటు చేశారు. మొత్తం 44 కమిటీలు ద్వారా ఆయా రంగాల్లో స్టడీ చేయనున్నారు. ఎక్స్ సర్వీస్ మెన్ సంక్షేమం, గిగ్ వర్కర్స్ సంక్షేమం, జర్నలిస్టుల సంక్షేమం, వికలాంగుల సంక్షేమం సాధికారత, బిజినెస్/ఎంఎస్ఎంఈ, స్పోర్ట్స్, పబ్లిక్ ట్రాన్స్ పోర్టేషన్ రోడ్స్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్, ఎన్విరాన్మెంటల్ ఫారెస్ట్, అర్బన్ ప్లానింగ్, హౌసింగ్, దేవాదాయ అన్ని మతాల ప్రార్థన మందిరాలు, అభివృద్ధి, ఎనర్జీ గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒకో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. ఈ కమిటీల సభ్యులు ఆయా రంగాల్లో స్టడీ చేసి తమ నివేదికలను ఈనెల 17వ తేదీ వరకు స్టీరింగ్ కమిటీకి అందజేయాలని సూచించారు.

భారత్‌పై 500% సుంకాలు!

మొదటిపేజీ తరువాయి

రానున్నది. గత ఏడాది భారతీయ దిగుమతులపై 25 శాతం ప్రతీకార సుంకాలను విధించిన ట్రంప్ ఆ తర్వాత రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు జరిమానాగా మరో 25 శాతం సుంకాలు విధించారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించిన దరిమిలా అమెరికా, భారత్ మధ్య సంబంధాలు క్షీణించాయి. చైనా వస్తువులపై 145 శాతం సుంకాలు విధించడంతో చైనా, అమెరికా మధ్య కూడా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి ప్రతీకారంగా చైనా కూడా అమెరికా వస్తువులపై 125 శాతం సుంకాలను విధించింది. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారత్‌పై మళ్లీ సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ఇటీవల సూచనప్రాయంగా హెచ్చరించారు. గత శనివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ తాను సంతోషంగా లేనని ప్రధాని నరేంద్ర మోదీకి తెలుసునని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. వాళ్లు వ్యాపారం చేస్తారు. మేము వాళ్లపై చాలా వేగంగా సుంకాలు పెంచగలము అంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

భారత పత్తిపై బంగ్లాదేశ్ టారిఫ్‌లు!

భారత్‌పై రగిలిపోతున్న బంగ్లాదేశ్, భారత్ పత్తి నూలు, దారం దిగుమతులపై టారిఫ్‌లు విధించాలని భావిస్తున్నది. దిగుమతులపై గత ఏడాది ఆగస్టు 10 నుంచి అమలవుతున్న డ్యూటీఫ్రీ విధానాన్ని ఎత్తివేసి, 10 నుంచి 20 శాతం సుంకం విధించాలని బంగ్లాదేశ్ కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన అంశంపై బంగ్లాదేశ్ ట్రేడ్, టారిఫ్ కమిషన్ ఈనెల 5న కీలక భేటీ నిర్వహించింది. ఇరు దేశాల మధ్య క్షీణిస్తున్న ద్వైపాక్షిక సంబంధాలు, బంగ్లాదేశ్ వాణిజ్య నివేదికలను ఉటంకిస్తూ భారతీయ నూలు పరిశ్రమ వర్గాలు తాజాగా ఈ విషయాన్ని వెల్లడించాయి. ముడి పత్తిని పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో బంగ్లాదేశ్ ఒకటి. దీంట్లో అత్యధిక భాగం భారత్ నుంచే దిగుమతి అవుతున్నది.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

మొదటిపేజీ తరువాయి

25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకు రానున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. ఇందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని, త్వరలోనే పాలసీని తీసుకు వస్తామన్న ముఖ్యమంత్రి ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు వీలుగా ప్రీ ప్రైమరీ విద్య అందించే విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రీ ప్రైమరీ చిన్నారులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించే యోచన చేస్తున్నట్లు తెలిపిన సీఎం. రాష్ట్రంలో ఐటిఐ లను ఏటీసీ లుగా తీర్చిదిద్దుతున్న ట్లు వివరించిన ముఖ్యమంత్రి.. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వారికి తెలిపారు ..మల్లెపల్లి ఐటీసీ ని సందర్శించాలని హిమాచల్ ప్రదేశ్ మంత్రి కి ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పైన ఆసక్తి చూపించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి..ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర నివేదిక ను తమకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టతకు ముఖ్యమంత్రి విజన్ ను మంత్రి రోహిత్ కుమార్ అభినందించారు.

పంట నష్ట నివారణకు రూట్ మ్యాప్

ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో వ్యవస్థను అమలులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఆయన తెలిపారు.ఈ మేరకు గురువారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ సచివాలయంలో భారత ఆహార సంస్థ,రాష్ట్ర పౌర సరఫరాల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సైలో పద్ధతిలో బియ్యం ,మొక్క జొన్న, సోయాబీన్ వంటి పంటలను కుడా నిల్వ చేసుకునే ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు.మనుషుల జోక్యం లేకుండానే సైలో పద్ధతిలో ఉండే ఇంటిగ్రేటెడ్ క్లినర్లు,డ్రైయర్లతో రెండు సంవత్సరాల వరకు ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు.ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు పంపడంతో మిల్లింగ్ లో జరుగుతున్న జాప్యంతో ధాన్యం చేడి పోయి నష్టం వాటిల్లుతుందని,మిల్లులలో శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసే అవకాశం లేక పోవడంతోటే ఈ నష్టం వతిలుతుందని ఆయన చెప్పారు.అటువంటి పరిస్థితిలలో రైతాంగానికి భరోసా ఇవ్వడంతో పాటు ధాన్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం శాస్త్రీయమైన సైలో పద్ధతిని అమలులోకి తేవాలి అనే ఆలోచనకు శ్రీకారం చుట్టమన్నారు.తద్వారా ధాన్యం కొనుగోలు సమయంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన సైలో పద్ధతిలో ఉండే డ్రైయర్ల ద్వారా తేమను తొలగించడంతో పాటు దాన్యన్ని దీర్ఘకలికాంగ పరిరక్షించుకోవచ్చని ఆయన తెలిపారు. చేతికొచ్చిన పంట పాడవకుండా ఉండెందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేవలనుకుంటున్న సైలో ప్రాజెక్టుతో పెద్ద ఎత్తున ప్రయోజనం ఉండే అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు.ప్రధానంగా కేంద్రప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మీదకు నెట్టేసి మిల్లింగ్ అయిన బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేయడంతో కొనుగోలుకు మిల్లింగ్ కు మధ్యన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 5,000 కోట్లు నష్టపోతుందని...సైలో పద్ధతిని అమలులోకి తెస్తే 5,000 కోట్ల భారాన్ని అధిగమించడంతో పాటు 1,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పద్ధతిని అమలులోకి తేవాలని యోచిస్తున్నామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు

గాంధీ కుటుంబాన్ని తిట్టిన
రేవంత్‌ను దమ్ముంటే నిలదీయండి!

మొదటిపేజీ తరువాయి

ప్రతాపం చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డిని తప్పుపట్టడం చేతగాని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట్లాడుతున్న తీరు పైన కేటీఆర్ ఎద్దేవా చేశారు.6 గ్యారంటీల అమలు పై రేవంత్ రెడ్డిని, రాహుల్ గాంధీని తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. అడ్డగోలు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డిని గట్టిగా అడిగితే "లాగులో తొండలు విడిచిపెడతా, పేగులు మెడలో వేసుకుంటా, గుడ్లు పీకి గోలీలు ఆడుతా"లాంటి బూతులు మాట్లాడుతున్నాడని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలను ప్రభుత్వం త్వరలో పెడుతుందన్న వార్తలు వస్తున్నాయని, ఈ ఎన్నికలను పార్టీ శ్రేణులంతా కలిసి సమిష్టిగా ఎదుర్కొని విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 9,700 కోట్ల రూపాయల అభివృద్ధి చేసిన విషయాన్ని ప్రజలకు ప్రస్తావించాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన తీరు ప్రతి డివిజన్లోని ఓటర్లకు ప్రజలకు ప్రచారం చేయాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మన పార్టీ తరఫున గెలిచి కేవలం భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి పక్షాన చేరి ఎమ్మెల్యే గాంధీ డబ్బులకు అమ్ముడుపోయాడన్నారు. ఎమ్మెల్యే పార్టీని ద్రోహం చేసి వదిలిపోయిన శేరిలింగంపల్లిలో ఎక్కడ సమావేశం పెట్టినా భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేస్తున్నారని అన్నారు. కేవలం పార్టీ మీద కేసీఆర్ గారి మీద ఉన్న అభిమానంతోనే శేర్లింగంపల్లిలో జరుగుతున్న ప్రతి సమావేశం విజయవంతం అవుతుందని కేటీఆర్ తెలిపారు. "హైడ్రా" పేరుతో నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూలగొడుతున్న తీరును ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు చేసిన ద్రోహాన్ని, రద్దు చేసిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రజలకు వివరించాలన్నారు.

ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో నిరసనకారులను చంపితే ఊరుకోబోం. తీవ్రమైన చర్యలుంటాయి. ఒకవేళ మీరు ప్రజలను చంపడం మొదలుపెడితే మేం మీపై బలంగా దాడి చేస్తాం. స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ఇరాన్ ప్రజలు ధైర్యవంతులు, తొక్కిసలాట వల్ల కూడా కొందరు చనిపోయి ఉండొచ్చు. కానీ, కావాలని హింసకు పాల్పడితే మాత్రం మూల్యం చెల్లించాల్సిందే

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

మున్సిపోల్‌పై ఫోకస్

మొదటిపేజీ తరువాయి

వ్యతిరేకిస్తూ గ్రామ స్థాయి నుంచి ఆందోళనకు సిద్ధమైంది. నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో 'తీర్మాణం' చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం గాంధీభవన్ లో టీపీసీసీ నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం కృషిచేసి, ప్రభుత్వం ఏర్పాటుకు కృషిచేసిన కార్యకర్తల గెలుపు బాధ్యత ముఖ్యమంత్రిగా నా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు తీసుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకోసం గల్లీ గల్లీలో కాకుండా ఇంటింటి ప్రచారంలో సీఎం నుంచి ప్రతి ఒక్కరు భాగస్వాములు కానున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నా బీఆర్ఎస్, మరో పక్క బీజేపీ అసత్య ప్రచారన్ని తిప్పికొట్టేందుకు వ్యూహాన్ని రచించారు. వీబీజీ రామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉమ్మడి జిల్లాలలో భారీ బహిరంగ సభల్లో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఎండగడుతూనే, మరో పక్క రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు తిప్పికొట్టనున్నారు. గత రెండేళ్లలో ప్రజా పాలన వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించనున్నారు. ప్రభుత్వం ఇంత చేస్తూన్నా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నేతలు సర్కారుపై చేస్తున్నది అసత్య ప్రచారం అని జనంలోకి తీసుకపోవాలన్నదే సీఎం లక్ష్యం.

భారీ బహిరంగ సభలు...

హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాలలో ఫిబ్రవరి 2 నుంచి భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, మరో పక్క ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర సర్కారు కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం కూలీలకు ఉరితాడు అంటూ ప్రచారం చేయబోతున్నారు. అలాగే ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు గత కొంత కాలంగా ఒంటికాలుపై నిల్చొని చేస్తున్న ఆరోపణలను ప్రజలకు నివృత్తి చేయబోతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది.అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.అందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

గెలుపు బాధ్యత ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులకు...

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపు బాధ్యతను ఎమ్మెల్యేలకు సీఎం అప్పగించారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తి ఫలితాలు వచ్చిన ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. నియోజకవర్గాల్లోని అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురాలని ఇందుకు ఎమ్మెల్యేలదే పూర్తి బాధ్యత అని సీఎం దిశ నిర్దేశనం చేశారు. జిల్లా మంత్రులు జిల్లాలలోని అన్ని నియోజకవర్గాలలో ఎన్నికలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అంజచేయాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ర్యాంకులు సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ర్యాంకుల ఆధారంగా పార్టీ పదవులు, ప్రభుత్వ పదవులతో పాటు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఖరారు అయితాయని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం.

ప్రజల్లోకి తీసుకెళ్లండి...

మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వార్డులు, గల్లీలలో అభివృద్ధి జరుగుతుందని, అలాగే పేదలకు సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలను సీఎం కోరారు. విపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి,సంక్షేమం కుంటుపడుతుందన్న నగ్న సత్యాన్ని ఓటర్లకు వివరించాలని సీఎం కోరారు.

సమస్యలపై దృష్టి పెట్టాలి...

మున్సిపాలిటీలలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. ఇందుకుగాను మున్సిపాలిటీలలో ఎలాంటి సమస్యలు, అభివృద్ధి తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిధులు విడుదల చేయనుందని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం రెండేళ్లు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలు ముద్రించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

కూలీల పొట్టగొట్టేందుకే 'వీబీజీ రామ్‌జీ చట్టం

- 'ఉపాధి హామీ' పేరు మార్పు వెనక మోడీ కుట్ర
- తిరస్కరిస్తూ గ్రామ సభల్లో తీర్మాణాలు చేయాలి
- మరో పక్క 'సర్' పేరుతో ఓటర్ల తొలగింపు
- ఓట్లు పోతే ప్రభుత్వ పథకాలకు పేదలు అనర్హులు
- కేంద్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 8: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వెనక ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేదలపై కక్షతో ఈ పథకాన్నే మారుస్తారా? అని ప్రశ్నించారు. నిబంధనల ముసుగులో ఈ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. మెజారిటీ ఉందని, చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదని అన్నారు. గురువారం గాంధీభవన్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యతన జరిగిన న పీసీసీ, పీఏసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే ఒప్పుకోమని రేవంత్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. ఉపాధి హామీ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఉపాధి హామీ పథకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు దొరల దగ్గర పేదలు వెట్టిచాకిరి చేస్తూ బతికేవారని, దేశప్రజలకు విముక్తి, స్వతంత్రాన్ని ఇచ్చి ఓటుహక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు.

పేదలకు ఆర్థిక భద్రత

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మొదట అమలు చేసింది తెలుగు రాష్ట్రాలేనని సీఎం తెలిపారు. ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గిపోయాయని అన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరుగుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగితే కార్పొరేట్ కంపెనీలకు చవకగా కార్మికులు దొరుకుతారని వెల్లడించారు. కార్పొరేట్ కంపెనీలు ఉపాధి హామీ చట్టాన్ని రూపుమాపే కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. పేదలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు.వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీఅంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

తిరస్కరిస్తూ గ్రామసభలు తీర్మానించాలి

గతంలో వ్యవసాయంపై కుట్ర చేశారని, రైతు వ్యతిరేక నల్ల వ్యవసాయ చట్టాలు తయారుచేశారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పోరాటం వల్ల నల్ల వ్యవసాయ చట్టాలు రద్దు చేశారని తెలిపారు. పేదలను బానిసలుగా మార్చేందుకు నూతన చట్టం చేస్తున్నారని, పేదలకు వ్యతిరేకంగా వీబీజీ రామ్‌జీ చట్టం తీసుకొచ్చారని అన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం రద్దు చేసే వారికి పోరాటం చేస్తామని, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అసెంబ్లీ తిరస్కరించిందని, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తిరస్కరిస్తూ గ్రామసభలు తీర్మానించాలని కోరారు.

ఎస్ఐఆర్ వెనక పెద్ద కుట్ర

2024 ఎన్నికల్లో తమకు 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారని సీఎం గుర్తు చేశారు. బీజేపీకి 400 సీట్లు ఇచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా పేదల హక్కులు కాలరాయాలని చూశారని, కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడం వల్ల బీజేపీకి సీట్లు తగ్గాయని, బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని తెలిపారు. 400 సీట్లు రాకపోవడం వల్ల రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని, రాజ్యాంగాన్ని మార్చలేకపోయారు కానీ వేరే రూపంలో హక్కులు కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ (సర్' తీసుకొచ్చారని, ఓటు హక్కు పోతే ఆధార్ కార్డు, సంక్షేమ పథకాలు పోతాయని, ఎస్ఐఆర్ వెనక పెద్ద కుట్ర ఉందని తెలిపారు.

రోడ్డు భద్రతా విధానాల్లో విస్తృత మార్పులు

మొదటిపేజీ తరువాయి

ఇలాంబర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణలో డ్రైవింగ్ శిక్షణ మరియు పరిశోధన సంస్థ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తూ కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. మొదటి దశలో అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఆర్టీసీ బస్సులను పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని తెలిపారు. తదుపరి దశల్లో టాక్సీలు, ఆటో రిక్షాలు, ఇతర వాణిజ్య వాహనాలకు ఈ విధానం వర్తింపజేస్తామని చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్, ఎల్పీజీ, సిఎన్జీ ఆటోలకు అనుమతి ఇవ్వడంతో పాటు డీజిల్ ఆటోల స్థానంలో మార్పిడి ప్రక్రియకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2024 నవంబర్ 16న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని అమలు చేశామని చెప్పారు. 2020లో రాష్ట్రంలో కేవలం 4,376 ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే ఉండగా, విధానం అమలులోకి వచ్చిన తర్వాత 2025 నాటికి 2,58,325 ఎలక్ట్రిక్ వాహనాలకు పెరిగినట్లు వెల్లడించారు. అవుటర్ రింగ్ రోడ్ పరిధిలో ఈ సంఖ్యను 100 శాతానికి పెంచడం, పరిధి బయట 25 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2024లో వాహనాల స్క్రాపింగ్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, పాత వాహనాలను స్క్రాప్ చేయడానికి పన్ను మినహాయింపు, జరిమానాల రద్దు వంటి ప్రోత్సాహకాలు కల్పించినట్లు తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ వాహనాలను తప్పనిసరిగా స్క్రాప్ చేయాలని ఆదేశాలు జారీ చేశామని, ప్రైవేట్ వాహనాలకు గ్రీన్ టాక్స్ విధించి అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. వాహనాల ఫిట్నెస్ ప్రక్రియలో మానవ ప్రమేయాన్ని తగ్గించి కఠినతరం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఫిట్నెస్ లేని వాహనాలను తొలగించి రోడ్డు భద్రత పెంచడంతో పాటు ప్రమాదాలు, కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష విధానాన్ని కూడా మరింత కఠినతరం చేయడానికి అధునాతన కెమెరాలు, సెన్సార్లు, కృత్రిమ మేధస్సు ఆధారిత ఆటోమేటెడ్ డ్రైవింగ్ పరీక్ష ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా రవాణాలో మహిళలు, పిల్లల భద్రత పెంచేందుకు బస్సులు, టాక్సీల్లో ట్రాకింగ్ పరికరాలు అమర్చి సమగ్ర నియంత్రణ కేంద్రం ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించిన సారథి వ్యవస్థ ఇప్పటికే అమలులో ఉందని, వాహనాల నమోదు కోసం వాహన్ వ్యవస్థ త్వరలో అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ వ్యవస్థల ద్వారా దేశవ్యాప్తంగా ఏకరీతి రవాణా సేవలు అందించి ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మారడం సులభతరం అవుతుందని, రవాణా కార్యాలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సేవలు పొందే వీలుంటుందని అన్నారు. నాణ్యతలేని ప్రతిబింబ టేపులను నివారించేందుకు నాణ్యమైన టేపుల అమరికకు ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు కార్డుల ముద్రణలో లోపాలు తొలగించేందుకు కేంద్రీకృత ముద్రణ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. అధునాతన కెమెరాలు, కృత్రిమ మేధస్సు ఆధారంగా వాహన తనిఖీలు నిర్వహించి అతివేగం, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ వాడకం వంటి నిబంధనల ఉల్లంఘనలను నియంత్రించనున్నట్లు తెలిపారు. రవాణా శాఖ కార్యాలయాల్లో దళారుల ప్రమేయాన్ని తొలగించేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శాఖ ప్రక్షాళనలో భాగంగా చెక్‌పోస్టులను తొలగించి అంతర్రాష్ట్ర రవాణాకు అడ్డంకులు లేకుండా చేసినట్లు తెలిపారు. రోడ్ సేఫ్టీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, పాఠశాలల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులు, కళాశాలల్లో రోడ్ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతపై పాంఫ్లెట్లు పంపిణీ చేశామని చెప్పారు. తెలంగాణలో రెండు డ్రైవింగ్ శిక్షణ మరియు పరిశోధన కేంద్రాలు, జిల్లా స్థాయి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. విజన్ 2047 లక్ష్యంగా ఐదు లక్షల హెవీ వాహన డ్రైవర్లకు నైపుణ్య శిక్షణ అందించే ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ప్రపంచస్థాయి రవాణా అకాడమీ, డ్రైవింగ్ మరియు రోడ్డు భద్రతలో ఉత్తమత కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ట్రక్ టెర్మినల్స్, పార్కింగ్ యార్డుల అభివృద్ధి, పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో ఆధునిక రవాణా కార్యాలయాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనపు బస్ టెర్మినల్స్ నిర్మించనున్నట్లు తెలిపారు.

రాజకీయం

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

మొదటి విడతలో బాలికలకు ప్రాధాన్యం

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందజేతపై కసరత్తు
- వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి నగరంలో నూతన పాఠశాలలు
- ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు సిలబస్
- విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 8: హైదరాబాద్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (వైఐఆర్ ఎస్) మొదటి విడతలో పూర్తయ్యే వాటిలో బాలికలకు ఎక్కువ స్కూల్స్ కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రతి నియోజకవర్గంలోనూ బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున వైఐఆర్ ఎస్ ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం బాలికలకు స్కూల్స్ కేటాయించిన నియోజకవర్గంలో మరో విడతలో బాలురకు కేటాయించాలన్నారు. విద్యా శాఖపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వైఐఆర్‌సీలో సోలార్ కిచెన్ల నిర్మాణాన్ని పీఎం కుసుమ్‌లో చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. వైఐఆర్ ఎస్ ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల్లలో స్వచ్ఛంద సంస్థల ద్వారా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని తెలంగాణవ్యాప్తంగా అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. తగినంత స్థలం, అవసరమైన మద్దతు అందజేస్తే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయగలమని అక్షయపాత్ర ప్రతినిధులు సీఎంకు తెలియజేశారు. ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి అందరికీ సకాలంలో భోజనం అందేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయింపు లేదా 99 సంవత్సరాలకు లీజు తీసుకునే అంశంపై జిల్లా కలెక్టర్లతో మాట్లాడి త్వరగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 23 నూతన పాఠశాల భవనాలు నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాచుపల్లి పాఠశాల స్థలం కేవలం అర ఎకరం మాత్రమే ఉండడంపై సీఎం ఆరా తీశారు. ఎక్కడైనా పాఠశాలకు కనీసం ఎకరంన్నర స్థలం ఉండాలని, బాచుపల్లి ప్రస్తుతం ఉన్న స్థలం సమీపంలో ఎకరంన్నర ఆ పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్ మార్పుపై కసరత్తును వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో నూతన కోర్సులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం చేసుకున్నందున దానిని త్వరగా అమలయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉద్యోగం లభించేలా సిలబస్, బోధన ఉండాలని సీఎం అన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవ సేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'బాగున్నారా.. అమ్మ!'

- రాష్ట్ర మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 8: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తన ఎర్రవెల్లి నివాసానికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఇంటికి వచ్చిన అతిథులను సంప్రదాయ అతిథి మర్యాదలతో ఆదరించి, ఆడబిడ్డలుగా భావించి పసుపు, కుంకుమ వస్త్రాలు, చీరలు, తాంబూలాలతో సాదరంగా సత్కరించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, అలాగే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క గురువారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా, జాతరను సందర్శించాల్సిందిగా ప్రభుత్వం తరపున కేసీఆర్‌ను వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేసి, మేడారం ప్రసాదాన్ని కేసీఆర్‌కు మంత్రులు అందజేశారు. ఈ భేటీలో కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ దంపతులు మహిళా మంత్రులను ఆత్మీయంగా పలకరిస్తూ సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. అనంతరం కేసీఆర్ దంపతులు ఏర్పాటు చేసిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కొంతసేపు పరస్పర యోగక్షేమాలు, ఇష్టాగోష్టి అనంతరం వారు తిరుగు ప్రయాణమయ్యారు.

పతంగుల పండగకు చెరువుల సుందరీకరణ

- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

ప్రతిపక్షం, హైదరాబాద్, జనవరి 8: హైడ్రా అభివృద్ధి చేసిన చెరువులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం సందర్శించారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత పతంగుల పండుగను పెద్దఎత్తున నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. కూకట్‌పల్లి నల్లచెరువుతో పాటు మాదాపూర్లోని తమ్మిడికుంట, పాతబస్తీలోని బమ్‌రుక్న్ ఉద్ దౌలా చెరువులను సందర్శించారు. మూడు నాలుగు రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి వేడుకలకు వేదికలు సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మొక్కలను విరివిగా నాటి చెరువులను సుందరీకరించాలని కోరారు. చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువుల పరిసరాలు ప్రజలకు ఆకర్షణీయంగా ఉండేలా అభివృద్ధి చేయాలని, నడక మార్గాలు, లైటింగ్, శుభ్రత పనులు, భద్రతా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. పండగ నాటికి చెరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

షాద్ నగర్‌లో గుట్టుగా సెక్స్ రాకెట్

- దాడులు చేసి పట్టుకున్న ప్రత్యేక పోలీసు బృందం
- ముంబై, గుజరాత్ యువతులను పెట్టి వ్యభిచారం

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 8: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో సెక్స్ రాకెట్ ముఠా దందా కొనసాగిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్‌ఓటి పోలీసులు గురువారం సాయంత్రం సెక్స్ రాకెట్ ముఠా నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. షాద్ నగర్ సీఎస్కే వెంచర్లో గత కొంతకాలంగా ముంబై, గుజరాత్ ప్రాంతాలకు చెందిన జావేద్, ఫాతిమా దంపతులు ముగ్గురు యువతులను పెట్టి సెక్స్ రాకెట్ నడుపుతున్నారు. అయితే ఎట్టకేలకు విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్‌ఓటి పోలీసులు పథకం ప్రకారం సీఎస్కే వెంచర్ లో గుట్టుక నిర్వహిస్తున్న ఓ విల్లాను చుట్టుముట్టి జావేద్ ఫాతిమా దంపతులతో పాటు నిషా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పచెప్పారు. ఈ విషయమై స్థానిక సీఐ విజయ్ కుమార్ ను వివరణ కోరగా తనకు తెలియదని చెప్పడం కొసమెరుపు. అయితే ఎస్ ఓ టి పోలీసులు ముగ్గురు బాధితులతో పాటు నిర్వాహకులను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పజెప్పినట్లు సమాచారం.

జేపీ దర్గా వార్షిక ఉత్సవాలకు రండి

- మైనారిటీ మంత్రి అజారుద్దీన్ ఆహ్వానించిన దర్గా ప్రతినిధులు

ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 8: తెలంగాణలో కుల మతాలకు అతీతంగా విరాజిల్లుతున్న పరమ పుణ్యక్షేత్రం హజరత్ జహంగీర్ పీర్ దర్గా వార్షిక ఉత్సవాలకు హాజరుకావాలని స్థానికులు మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. జనవరి నెల 15వ తేదీనాడు హజరత్ జహంగీర్ పేరు దర్గా ఉర్సు ఉత్సవాలలో భాగంగా గంధోత్సవం కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరుకావాలని మంత్రి అజారుద్దీన్ ను దర్గాకు చెందిన సయ్యద్ హబీబ్, మొహమ్మద్ హమీత్, సయ్యద్ జహంగీర్ లు కోరారు. ప్రతియటా పెద్ద ఎత్తున నిర్వహించే హజరత్ జహంగీర్ పీర్ దర్గా వార్షిక ఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమానికి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా హాజరుకావాలని కోరారు. బాబా ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా వారిని కోరారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎంతో విశిష్టాత్మకంగా రూపొందించే ఈ వేడుకలకు తప్పకుండా హాజరుకావాలని మంత్రిని కోరినట్లు సయ్యద్ హబీబ్ మీడియా తెలిపారు.

జాగృతి మహిళా వింగ్ అధ్యయన కమిటీలో భవానీ వేముల

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 8 : తెలంగాణ జాగృతి సంస్థ రాష్ట్రంలో త్వరలో ఒక రాజకీయ శక్తిగా రూపాంతరం చెందే క్రమంలో ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీలో భవానీ వేములకు మహిళా విభాగ కమిటీలో స్థానం కల్పించారు. అలాగే కుసుమ రజిత, రేణుక యాదవ్ లను ఈ కమిటీలో నియమించారు. ఈ నియామకం పట్ల వారు తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భవానీ వేములు మాట్లాడుతూ, తమ నాయకురాలు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మహిళల సమస్యలు, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ జాగృతి బలోపేతానికి, సంస్థ లక్ష్యాల సాధనకు అంకితభావంతో పని చేస్తానని తెలిపారు.

హరీశ్‌రావుకు తీన్మార్ మల్లన్న అమ్ముడు పోయిండు

- బీఆర్ఎస్ విష కౌగిలి లో ఉండి కవిత పై అసత్య ప్రచారం
- కవితపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే తెలంగాణలో తిరగనీయం
- కుక్కను తరిమి కొట్టినట్లు తరిమికొడతాం
- తెలంగాణ జాగృతి నాయకులు శ్రీకాంత్ గౌడ్, ఆనంద్, మాధవి.

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 8: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న విషప్రచారం చేస్తున్నాడని తెలంగాణ జాగృతి నాయకులు మండిపడ్డారు. హరీష్ రావు డైరెక్షన్ లో, బీఆర్ఎస్ విష కౌగిలిలో చేరి తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ జాగృతి బంజారాహిల్స్ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్ గౌడ్, జాగృతి నాయకులు ఆనంద్, మాధవి మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నవి నీచ, దిగజారుడు, బ్లాక్ మెయిల్ రాజకీయాలని శ్రీకాంత్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి వర్గంలోకి కవిత గారిని తీసుకునే ప్రయత్నం చేశారంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఆయన కౌంటర్ ఇచ్చారు. జూన్ 8 నాడు ముగ్గురు కాంగ్రెస్ మంత్రులు ప్రమాణం చేశారని అప్పుడు కవిత గారు బీఆర్ఎస్ లోనే ఉన్నారన్న సోయి కూడా లేకుండా మల్లన్న మాట్లాడుతున్నారని అన్నారు. మోకాలికి బోడిగుండుకు ముడి పెట్టేలా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. టీఆర్పీ అనే పార్టీ పెట్టిన నువ్వు కాంగ్రెస్ బీఫామ్ మీద గెలిచిన ఎమ్మెల్సీకి ఎందుకు రాజీనామా చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. నీ పార్టీ కి ఇంకా గుర్తు కూడా రాలేదని....కచ్చితంగా నీకు క్యూఆర్ కోడ్ ఉన్న గుర్తు రావాలని కోరుకుంటున్నామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా మళ్లీ ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసే నీచమైన వ్యక్తివి నువ్వు అన్నారు. నీ టీఆర్పీ పార్టీ పేరు టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ అని పెట్టుకోవాలని సూచించారు. నీ ఛానెల్ వ్యూస్ కోసం ఇష్టానుసారం మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. సిగ్గు, లజ్జ లేని వ్యక్తి తీన్మార్ మల్లన్న అని మండిపడ్డారు. ఛాయ్ కి పైసలు అడుకున్న నీకు హెచ్ఎండీఏ పరిధిలో 660 ఎకరాల భూమి ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. స్కూటీ పైన తిరిగే నీకు హెలికాప్టర్ లో ప్రచారానికి వెళ్లేంత డబ్బులు ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. సాయి ఈశ్వరాచారి అనే బీసీ బిడ్డ ఆత్మహత్యకు నువ్వే కారణమా కాదా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి ఆత్మబలిదానం చేసుకున్నట్లే నువ్వు బీసీల కోసం బలిదానం చేసుకోవాలంటూ ఆయనను రెచ్చగొట్టలేదా అని ప్రశ్నించారు. కచ్చితంగా ఈశ్వరాచారి మరణం తీన్మార్ మల్లన్న చేసిన హత్యేనని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పేదలు నీ దగ్గరకు వస్తే వారిని కూడా వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేసిన నీచ చరిత్ర నీదంటూ శ్రీకాంత్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద వారి నుంచి బడా కార్పొరేట్ సంస్థల వరకు బ్లాక్ మెయిల్ చేసి వేల కోట్లకు పడగెత్తావని అన్నారు. కవితక్క మీద అవాకులు పేలినందకు గతంలోనే నీ పై దాడి చేశాం. మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తే ఈసారి పాతళంలోకి తెక్కుతామని శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.

కుక్కను తరిమినట్లు తరిమి కొడతాం

కవితక్క మీద అవాకులు పేలితే కుక్కను తరిమినట్లు తరిమికొడతామని జాగృతి నేత ఆనంద్ హెచ్చరించారు. హరీష్‌రావు ఎంగిలి మెతుకులకు అమ్ముడు పోయి కవితక్క మీద ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. గతంలోనే నీ పై దాడి చేస్తే తృటిలో తప్పించుకున్నావ్. కానీ ఈ సారి మాత్రం నిన్ను తెలంగాణ లో తిరగనివ్వమని హెచ్చరించారు. హరీష్ వేసే కుక్క బిస్కట్ల కోసం కవితక్క మీద మొరుగుతున్నావన్నారు. ఆడబిడ్డల మీద నువ్వు మాట్లాడుతున్న మాటల కారణంగా వాళ్లు రాజకీయాలకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. రాజకీయంగా విధానపరంగా మాట్లాడితే సరే గానీ తలతిక్క వ్యాఖ్యలు చేస్తే కుక్క తరిమినట్లు తరిమికొడతామని ఆనంద్ హెచ్చరించారు.

దమ్ముంటే నీ వెనుక ఉన్న గుంటనక్కలు మాట్లాడాలి

హరీష్‌రావు ఇచ్చిన కోట్ల సొమ్ముతో కవితక్క మీద పిచ్చికుక్కల తీన్మార్ మల్లన్న మొరుగుతున్నాడని జాగృతి మహిళా నాయకురాలు మాధవి మండిపడ్డారు. కవితక్క కాలి గోటికి కూడా సరిపోని వ్యక్తి తీన్మార్ మల్లన్న అని విమర్శించారు. దమ్ముంటే మల్లన్న వెనుక ఉండి ఆడిస్తున్న గుంట నక్కలు బయటకు వచ్చి మాట్లాడాలని మాధవి డిమాండ్ చేశారు. మల్లన్న అజెండా ఏంటీ ఆయన ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలన్నారు. బీసీల కోసం పార్టీ పెట్టానని చెబుతున్న మల్లన్న వెనుక అసలు ఎంత మంది బీసీలు ఉన్నారో చెప్పాలని కోరారు. మున్నూరు కాపు కులంలో చెడబుట్టావని మాధవి మండిపడ్డారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ ను తిట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ను తిడుతున్నావ్. అసలు నీ పార్టీ ఏంటో, విధానాలు ఏంటో ప్రజలకు చెప్పాలని కోరారు. ఆస్తుల పంచాయితీ కాదని శాసన మండలి కవిత స్పష్టంగా దేవుడి మీద, తన పిల్లల మీద ఒట్టు వేశారు. కవితక్కను ప్రమాణం చేసి చెప్పాలని అడిగే స్థాయి నీకుందా అని ప్రశ్నించారు. బీసీల కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న కవితక్క పై పిచ్చి కూతలు కూస్తే నీ భరతం పట్టటం ఖాయమని మాధవి హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిలో గోడ నిర్మాణం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 8: మండలంలోని సురంగల్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 135 లో ఉన్న ప్రభుత్వ భూమిని పక్కన భూమి ఉన్న వ్యక్తి కబ్జా చేసి చుట్టూ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం జరుగుతోంది. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్ సిబ్బందితో కలిసి కబ్జా జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి పనులను నిలిపివేశారు. విచారణ అనంతరం అట్టి ప్రభుత్వ భూమిలో వేసిన గోడలను జేసీబీతో తొలగించడం జరిగింది. అనంతరం ప్రభుత్వం సూచించిన బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ గౌతమ్ కుమార్ వెల్లడించారు.

గొర్రెలు, మేకలకు రోగ నివారణ టీకాలు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 8: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో గురువారం గొర్రెలకు, మేకలకు డొబ్బరోగ నివారణ టీకాలను వేశారు. అమ్డాపూర్ పశువైద్యాదికారిణి దేవిరెడ్డి గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ, ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గొర్రెలకు, మేకలకు డొబ్బరోగం రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గొర్రెల, మేకల పంపెకం దారులు తదితరులున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి రాష్ట్రంలో యూనిట్ విద్యుత్ రూ.5.19గా ఉండేది. దాన్ని రూ.4.90కి తగ్గించాం. మార్చినాటికి మరో 10 పైసలు, మూడేళ్లలో రూ.1.19 తగ్గించి యూనిట్ రూ.4కే అందిస్తాం. 2019, 2024 నాటి ట్రూ అప్ చార్జీల భారం రూ.4,498 కోట్లను ప్రభుత్వమే భరించే నిర్ణయాన్ని కేబినెట్‌లో ఆమోదం తెలిపాం. వైసీపీ ప్రభుత్వం కమీషన్ల కోసం గందరగోళ నిర్ణయాలు అమలు చేసింది.

\- ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్

'బంగ్లా' విషయంలో భారత్ తప్పటడుగు!

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత నెల రోజుల నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం మొదలుపెట్టారు.ఈ నిరసనలు ఆగస్టు 5న తీవ్ర హింసాత్మకంగా మారాయి. షేక్ హసీనా తన ప్రాణాలను కాపాడుకోవడానికి భారత్‌కు రావాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో నిరంకుశ పాలనను కొనసాగించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి.బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడిగా పేరున్న హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్‌కు, భారత్‌తో చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా, భారత్ మధ్య సంబంధాలు కూడా అదే విధంగా కొనసాగాయి. అయితే, భారత్ మద్దతుతోనే షేక్ హసీనా అధికారంలో ఉన్నారని బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్షాలు, షేక్ హసీనా వ్యతిరేకులు ఆరోపిస్తూ వచ్చారు.గతేడాది ఆగస్టులో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో యాంటీఇండియా సెంటిమెంట్ మరింత పెరిగింది.బంగ్లాదేశ్‌ను భారత్ ఎప్పుడూ షేక్ హసీనా కుటుంబ దృష్టితోనే చూస్తోందని, అంతకు మించి చూసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని బంగ్లాదేశ్ మీడియా అంటోంది.ఈ నెల డిసెంబర్ 23న బ్రస్సెల్స్‌కు చెందిన లాభాపేక్ష లేని పరిశోధనా సంస్థ ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ (ఐసీజీ) భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలపై 'ఆఫ్టర్ ది ''గోల్డెన్ ఎరా'': గెటింగ్ బంగ్లాదేశ్‌ఇండియా టైస్ బ్యాక్ ఆన్ ట్రాక్ అనే పేరుతో 53 పేజీల రీసర్చ్ రిపోర్టును ప్రచురించింది. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా తన పదవిని కోల్పోవడం భారత్‌కు తీవ్ర ఎదురు దెబ్బ అని ఈ నివేదికలో పేర్కొంది. బంగ్లాదేశ్‌భారత్ సంబంధాలపై ఐసీజీ తాజాగా విడుదల చేసిన నివేదికలో.. విలియం వ్యాన్ షెండెల్ పుస్తకం 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' లోని కోట్‌ను కూడా చేర్చింది.'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' పుస్తకంలో విలియం వ్యాన్ షెండెల్ రాసిన వివరాల్లో, '' బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి భారత్ మద్దతు ఇచ్చినప్పటికీ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు శత్రుత్వంలా కాకపోయినా, తరచూ ఉద్రిక్తంగానే ఉండేవి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో ఒకరి పాత్రను మరొకరు తక్కువ చేసుకునే కథనాలను రెండు దేశాలు ప్రోత్సహించేవి'' అని పేర్కొన్నారు. 'షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు భారత్ ఇచ్చిన స్థిరమైన మద్దతు ద్వారానే ఎన్నో సంవత్సరాలుగా భారత్, బంగ్లాదేశ్ సంబంధాల మధ్య పునాది బలపడిందని పునరుద్ఘాటించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రస్తుతం ఈ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. రెండు దేశాల మధ్య పునాది కూడా తీవ్రంగా దెబ్బతిన్నది'' అని డైలీ స్టార్ రాసింది. 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చడం వంటివి బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావనను మరింత పెంచాయి.బాబ్రీ మసీదు కూల్చిన తర్వాత, బంగ్లాదేశ్‌లో హిందూ కమ్యూనిటీకి చెందిన వారిపై దాడులు జరిగాయి. భారత్‌లో హిందూముస్లింల మధ్య మత ఘర్షణలు జరిగాయి. భారత దేశీయ రాజకీయాల్లో ముస్లింల పట్ల ద్వేష రాజకీయాలు ఉంటే అది బంగ్లాదేశ్‌ను కూడా ప్రభావితం చేస్తుందని, అక్కడ ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని ఆశించలేమని ప్రొఫెసర్ లామా అన్నారు. 16 నెలలుగా భారత్‌బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్తంభించిపోయాయి. గత 10 రోజులుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. భద్రతా కారణాలతో, భారత్‌లో ఢిల్లీ సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సర్వీసులను ఢాకా నిలిపివేసింది. అలాగే, భారత్ కూడా ఢాకాతో సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.ఢాకా, ఢిల్లీ మధ్యలో ఇంత అపనమ్మకం, అనుమానాన్ని నేనెప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ నిబంధనలు ప్రకారం, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాలకు భద్రత కల్పించాలి. రెండు పొరుగుదేశాలు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నందున భారత్ వాస్తవాన్ని అంగీకరించి, బంగ్లాదేశ్‌తో ఉన్న సంబంధాల విషయంలో నమ్మకాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రతిపక్షం

హైదరాబాద్,

శుక్రవారం
09.01.2026

కృత్రిమ జన్యు సృష్టికర్త మన భారతీయుడే

ఎంతో మంది శాస్త్రవేత్తల అంకితభావం, పరిశోధనల కృషి ఫలితాలే మనల్ని రాతి యుగం నుండి డిజిటల్ యుగానికి తీసుకువచ్చాయి. వీరిలో మన దేశానికి చెందిన అనేక మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. వారిలో జన్యు శాస్త్రంపై పరిశోధనలు చేసి అత్యంత విలువైన 'నోబెల్' బహుమతిని అందుకున్న ఒక మహావ్యక్తి హరగోవింద్ ఖొరానా.

జనక మోహన రావు దుంగ
8247045230

ఎంతో మంది శాస్త్రవేత్తల అంకితభావం, పరిశోధనల కృషి ఫలితాలే మనల్ని రాతి యుగం నుండి డిజిటల్ యుగానికి తీసుకువచ్చాయి. వీరిలో మన దేశానికి చెందిన అనేక మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. వారిలో జన్యు శాస్త్రంపై పరిశోధనలు చేసి అత్యంత విలువైన 'నోబెల్' బహుమతిని అందుకున్న ఒక మహావ్యక్తి హరగోవింద్ ఖొరానా. అవిభక్త భారతదేశములోని పంజాబ్ రాష్ట్రమునకు చెందిన ముల్తాన్‌కు సమీపంలో ఉన్న రాయపూరు అను గ్రామములో 1922 జనవరి 9 న కృష్ణదేవి, గణపత్ రాయ్ ఖొరానా దంపతులకు అయిదుగురి సంతానములో చివరివాడిగా జన్మించారు. స్కాలర్‌షిప్‌ల సహాయంతో లాహోర్‌లోని పంజాబ్ యూనివర్శిటీ నుండి 1943లో బి.యస్సీ, 1945లో యం.యస్సీ పట్టా పొందారు. స్విట్జర్లాండ్, కేంబ్రిడ్జ్, కెనడాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో కొనసాగింది. 1945లో క్రిమిసంహారక మందులు, శిలీంధ్రనాశకాలను అధ్యయనం చేయడానికి విద్యార్థి హోదాలో ఇంగ్లాండుకు పంపబడ్డారు. 1945 నుండి 1948 వరకు శాస్త్ర పరిశోధనలకు గాను లివర్‌పూల్ యూనివర్శిటీ ఆయనకు పి.హెచ్.డి ప్రదానం చేసింది. అనంతరం రెండు సంవత్సరములు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ లో, 195152లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయములో మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లములకు సంబంధించిన పరిశోధనలు సాగించారు. 1952లో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలములో చేరారు. 1950ల ప్రారంభంలో సైన్స్ మొదటిసారిగా జన్యువులను ప్రోటీన్లుగా అనువదించే యంత్రాంగాలను అర్థం చేసుకునే దశలో ఉన్నప్పుడే, వాంకోవర్ లో తన మొదటి ఉద్యోగంలో ఈ ప్రక్రియను అధ్యయనం చేయడం ప్రారంభించారు. 1960లో అమెరికా లోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలములో ఆచార్యునిగా చేరి, తన సహచరులతో జన్యు సంకేతం సమస్యను పరిష్కరించడానికి కృషి చేశారు. డిఎన్ఎ, ఆర్ఎన్ఎ కణంలోని ప్రోటీన్లుగా ఎలా రూపాంతరం చెందుతాయో నిర్ణయించిన వారిలో ఈయనే మొదటివారు. 1970లో ప్రతిష్ఠాత్మకమైన మశాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో రసాయనశాస్త్ర ఆచార్యునిగా చేరారు. ప్రపంచ జీవశాస్త్రవేత్తలు ఎప్పటి నుండో ఎదుర్కొంటున్న "ప్రయోగశాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా?" అనే ప్రశ్నకు, వంశపారంపర్యముగా సంక్రమించే జీవ నిర్మాణానికి దోహదం చేసే "కృత్రిమ జన్యువును" సృష్టించి సమాధానం ఇచ్చారు. ఈ ఆవిష్కరణ జన్యు సాంకేతికత జెనెటిక్ ఇంజనీరింగ్ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి నాంది అయింది. 2019లో ప్రపంచాన్నే గడగడలాడించిన 'కొవిడ్ వైరస్' నిర్ధారణలో ఉపయోగించే 'పిసిఆర్' పాలిమరేజ్ చైన్ రియాక్షన్ పరీక్ష



లో ఈయన చేసిన శాస్త్ర పరిశోధనలు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇది వైరస్ వంటి నిర్దిష్ట జీవి నుండి జన్యు పదార్థాన్ని గుర్తించే పరీక్ష. ఈయన ప్రత్యేకంగా సృష్టించిన కృత్రిమ జన్యు శకలాలు మానవులలో జన్యు ఆధారిత వ్యాధులను, మానవ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి, డిఎన్ఎ విశ్లేషణకు కీలకమయ్యాయి. కొత్త మొక్కలు, జంతువులను క్లోనింగ్ చేయడం, రూపకల్పన చేయడంలో కూడా ఈ ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. న్యూక్లియిక్ ఆమ్ల క్షారాలైన అడెనిన్ (ఎ), గ్వానిన్ (జి), యురాసిల్ (యు), సైటోసిన్ (సి) ప్రోటీన్ సంశ్లేషణ సమయంలో 20 వేర్వేరు అమైనో ఆమ్లాల క్రమాన్ని ఎలా నిర్ణయిస్తాయో నిరూపించారు. 'కోడాన్'ను రూపొందించే మూడు న్యూక్లియోటైడ్ల సమూహమైన మొదటి బేస్ 'ట్రిప్లెట్' ను వర్ణించారు. 1972లో సంవత్సరాల పరిశోధన తర్వాత ఒక జీవి వెలుపల పనిచేసే జన్యువును పూర్తిగా సంశ్లేషణ చేసిన ప్రపంచంలో మొట్టమొదటి వ్యక్తి అయ్యారు. డిఎన్ఎ విభాగాలను కలిపే పాలిమరేజ్, లిగేజ్ ఎంజైమ్‌లను ఉపయోగించి మొదటి సింథటిక్ జన్యువులోకి వాటిని సమీకరించడం ద్వారా పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (పిసిఆర్) అభివృద్ధికి తోడ్పడ్డారు. ప్రతి అమైనో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందుపరచబడి ఉన్నదని కనుగొన్నారు.

నోబెల్ బహుమతి - గుర్తింపు:

ఖొరానా, ఆయన బృందం ఒక బాక్టీరియంలో తగిన విధంగా పనిచేసే క్రియాత్మక జన్యువును సృష్టించడం ద్వారా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవము తీసుకువచ్చారు. దీనికి గాను 46 యేండ్ల వయస్సులోనే 1968లో వైద్యశాస్త్రములో మార్షల్ డబ్ల్యూ. నిరెన్‌బర్గ్, రాబర్ట్ డబ్ల్యూ హోలీలతో కలిసి నోబెల్ బహుమతి అందుకున్నారు. డీఎన్ఏ కోడ్ ను ఛేదించి తొలి కృత్రిమ జన్యువును తయారు చేసి 'కృత్రిమ జన్యుశాస్త్ర పితామహుడు'గా పిలుస్తారు. ఎంజైమ్ల సహాయంతో వివిధ ఆర్ఎన్ఏ గొలుసులను నిర్మించి, ప్రోటీన్ల అమైనో ఆమ్ల క్రమాల ద్వారా ఎన్నో జన్యు సమస్యలకు పరిష్కారాన్ని చూపారు. 1970లో రోడాప్సిన్ దృష్టి వర్ణద్రవ్యంపై, కంటి రెటీనా ఫోటోరిసెప్టర్ కణాలలో కాంతి ట్రాన్స్‌డక్షన్పై పరిశోధనలు చేశారు. అలాగే ప్రయోగశాలలో కాంతి శక్తిని రసాయన శక్తిగా మార్చడానికి మెమ్బ్రేన్ ప్రోటీన్ అయిన బ్యాక్టీరియోర్‌హోడాప్సిన్ జీవశాస్త్రాన్ని కూడా పరిశోధించారు.

అదనపు గౌరవాలు:

అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్, అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రాయల్ సొసైటీలో విదేశీ సభ్యునిగా కూడా పనిచేశారు. ఖొరానా అందుకున్న ఇతర పురస్కారాలలో అమెరికన్ అకాడమీ ఆఫ్ అచీవ్‌మెంట్స్ గోల్డెన్ ప్లేట్ అవార్డు (1971), విల్లార్డ్ గిబ్స్ మెడల్ (1974), గైర్డ్నర్ ఫౌండేషన్ వార్షిక అవార్డు (1980), లూయిసా గ్రాస్ హార్విట్జ్ బహుమతి (1969), లాస్కర్ ఫౌండేషన్ అవార్డు (1969), మరియు పాల్ కేసర్ ఇంటర్నేషనల్ అవార్డ్ (1987) ముఖ్యమైనవి. 1969లో భారత ప్రభుత్వం రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ ను ప్రదానం చేసింది. 89 ఏళ్ల వయసులో 2011, నవంబర్ 9న మసాచుసెట్స్‌లోని కాంకార్డ్‌లో ఆయన కన్నుమూశారు. ఆయన మరణానంతరం శాస్త్రీయ జర్నల్స్ ఆయన్ని "రసాయన జీవశాస్త్ర రంగ వ్యవస్థాపక పితామహుడు"గా కొనియాడాయి. డాక్టర్ ఖొరానా జీవితం తరతరాల యువ శాస్త్రవేత్తలకు నిరంతర స్ఫూర్తిదాయకం.

(నేడు హరగోవింద్ ఖొరానా జన్మదినం)

(వ్యాసకర్త సామాజిక, ఆర్థిక విశ్లేషకులు)

సావిత్రిబాయి పూలే.. తోడుగా ఫాతిమా షేక్

సంపతి రమేష్ మహారాజ్
7989579428

మనదేశంలో ఆడపిల్ల చరిత్ర, వర్తమానం, భవిష్యత్‌ను అక్షరాలతో వెలిగించిన జ్ఞానజ్యోతి సావిత్రిబాయి పూలే. ఆ జ్ఞానజ్యోతికి తోడైన మరో మహిళ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ 19వ శతాబ్దంలో మహారాష్ట్రలో మహిళల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి మహిళా గురువులు. సావిత్రిబాయి భారతీయ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచింది. ఆమె విద్య ఉద్యమంలో పాల్గొని ఆ కుటుంబానికి తోడుగా నిలిచిన దేశ తొలి ముస్లిం మహిళా టీచర్ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలేతో కలిసి దళిత, ముస్లిం, బాలికల విద్యా వ్యాప్తికి కృషి చేసింది. ఫాతిమా షేక్ 1831 జనవరి 9న పుణెలో జన్మించారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలైనది. ఫాతిమా షేక్ ఆమే సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో విద్యనభ్యసించింది. సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ అహ్మద్ నగర్‌లోని సింధియా ఫర్రార్ అమెరికన్ మిషనరీలో ఉపాధ్యాయ శిక్షణపొందారు. ఫాతిమా సోదరుడు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే పూలే దంపతుల 1848లో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. ఆ దంపతులు స్థాపించిన పాఠశాలల్లో ఫాతిమా షేక్ విద్య బోధించింది. 1851లో ముంబాయిలో రెండు పాఠశాలల స్థాపనలో పాల్గొన్నది. వీరిద్దరూ అట్టడుగు కులాల ఆడపిల్లలకు, ఆధిపత్య కులాల ఆడ పిల్లలకు విద్యానందించి వారి సాధికారతకు కృషి చేసిన తొలి ఫెమినిస్ట్ లు. అన్ని కుల, మతాల పిల్లలకు విద్యను బోధించారు. వారి విద్యా ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. భవిష్యత్ తరాల కోసం వాళ్లు అవమానాలను, దాడులను సైతం భరించారు. అమ్మాయి చదువు అవనికి వెలుగని చాటిచెప్పి అంతరిక్షం దాకా నడిపించిన గొప్ప మహిళామణులు.

పూలే దంపతులకు అండగా ఫాతిమా కుటుంబం.

ఫాతిమా షేక్ సహకారం లేకుండా పూలే దంపతుల స్త్రీ, దళిత విద్యా ఉద్యమం పరిపూర్ణం కాదు. ముస్లిం మహిళగా కుల, మత భేదాలు వీడి సమానత్వ ఆలోచనలకు అండగా నిలబడి, భారతీయ స్త్రీవాదానికి పునాది వేశారు. సావిత్రిబాయి పూలే స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో "మహిళా సేవ మండల్" సంఘాన్ని స్థాపించింది. లింగ వివక్షతకు, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది. కుల వ్యవస్థలో సామాజిక అణిచివేతను, మూఢత్వాన్ని పారద్రోలి "సత్యాన్ని" శోధించడానికి 1873



లో భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించినది. ఈ సంస్థ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. బాల్యంలో వైధవ్యాన్ని అనుభవించే ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోశారు. వితంతు స్త్రీల శిరోముండనంను తీవ్రంగా ఖండించి ఆపేసింది. సత్యశోధక్ సమాజ్ లోని 'మహిళా విభాగం' సావిత్రిబాయి నేతృత్వంలో పురోహితులు లేకుండానే వివాహాలను నిర్వహించారు. కరువు బారిన పడి అనాధలైన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. వీరినే పిల్లలుగా భావించి ఆ పుణ్య దంపతులిద్దరు సంతానాన్ని వద్దనుకున్నారు. యశ్వంత్ రావు అనే అనాధ బాలున్ని దత్తపుత్రుడిగా పెంచుకున్నారు. పూలే దంపతులు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలలు ప్రారంభించడంతో జ్యోతీరావ్ పూలేను తండ్రి ఇంటి నుంచి బయటకు పంపాడు. అప్పుడు ఫాతిమా సోదరుడు మియాన్ ఉస్మాన్ షేక్ పూలే దంపతులకు ఆశ్రయమిచ్చారు. పూలే దంపతుల సంస్కరణలను అడగడుగున ఆధిపత్య కులాలు వ్యతిరేకించినప్పటికీ వారికి ఫాతిమా కుటుంబం సహకరించింది. కానీ ఫాతిమా షేక్‌ను చరిత్రలో ఒక అజ్ఞాతహీరోగా, కేవలం సావిత్రి నీడగా చూడడం సరికాదు. ఆమెతో పాటు నడిచిన సహోద్యోగిగా, సహచరిగా, సహోదరిగా గుర్తుంచుకోవాలి.

ఉమ్మడి సహకారంతో విముక్తి ఉద్యమాలు

సావిత్రిబాయి పూలే బాలికలకు విద్య బోధించడానికి వెళ్తున్నప్పుడు అగ్రకులాలు ఆమెపై రాళ్లు, పశువుల పేడ నీళ్ళు చల్లి తీవ్ర అవమానాలు గురిచేసినప్పుడు ఫాతిమాతో పాటు పలువురు అండగా నిలిచారు. చమార్ కులానికి చెందిన కర్ర సాము యోధుడు లహూజీ సాల్వే (మాతంగి) ఆమెకు రక్షణగా నిలిచాడు. ఆయన మహారాష్ట్రలో జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్‌లో చురుకుగా పనిచేసి, దళిత, అస్పృశ్యులకు విద్యా ప్రచారం, కులవివక్ష వ్యతిరేక పోరాటాలు చేశాడు. తమిళ దళిత నాయకుడు అయోతి దాస్ ద్రావిడ ఆలోచనల పయనీర్" అని పిలుస్తారు. ఆయన ద్రావిడ, దళిత రాజకీయాలకు పునాది వేశాడు. ఆయన ఆలోచనా వారసత్వంతో పెరియార్ ద్రావిడ ఉద్యమాన్ని విస్తృతపరిచి అట్టడుగు వర్గాల సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషి చేశారు. అనాడు పెరియార్ ,అంబేద్కర్ బహుజన పోరాటాలపై కూడా మాట్లాడుకున్నారు. మహారాష్ట్ర కొల్హాపూర్ సంస్థాన రాజు, రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ అంబేద్కర్‌కు ఆర్థిక సహాయం చేసి, దళిత, బహుజన ఉద్యమాన్ని ప్రోత్సహించాడు. పూలే దంపతుల విద్య ఉద్యమానికి ఫాతిమా షేక్ అండగా నిలిచింది. పై ఉదాహరణలు పరిశీలించినట్లయితే పూలే దంపతులు, ఫాతిమా షేక్ నుంచి అంబేద్కర్ వరకు బీసీలకు, దళితులకు, ముస్లింలకు చక్కటి అనుబంధం ఉండేదని స్పష్టమవుతుంది. నేడు ఆ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్స్ కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో '42 శాతం రిజర్వేషన్ సాధన సమితి' పేరుతో ఉమ్మడి ఉద్యమం జరుగుతుంది. ఇది మరింత బలపడి సమాజంలో వెలితే బహుజన రాజ్యాధికారానికి పునాదిపడుతుంది.

(మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

ప్రవాస జీవనం: ఆత్మశోధన, అన్వేషణల సమాహారం

ముహమ్మద్ ముజాహిద్
9640622076

మట్టి వాసనను, కన్నవారి ఆత్మీయతను, పుట్టి పెరిగిన ఊరి జ్ఞాపకాలను గుండెల్లో దాచుకుని.. రెక్కలొచ్చిన పక్షుల్లా వేల మైళ్ల దూరం పయనించే వారే ప్రవాసులు. మెరుగైన భవిష్యత్తు కోసం, ఆశల సాకారం కోసం పరాయి దేశంలో అడుగుపెట్టడం అనేది కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదు, అది ఒక మరో జన్మ. చూసే కళ్లకు విదేశీ జీవనం రంగుల లోకంలా అనిపించినా, ఆ రంగుల వెనుక ఎన్నో కఠిన వాస్తవాలు, ఒంటరితనపు నిశ్శబ్దాలు మరియు నిరంతర సంఘర్షణలు దాగి ఉంటాయి. అదే సమయంలో, ఈ ప్రయాణం మనిషిని జ్ఞానవంతుడిగా, సహనశీలిగా మారుస్తుంది. పవిత్ర గ్రంథాలు సైతం ప్రయాణాన్ని ఒక 'దివ్య జ్ఞాన మార్గం'గా అభివర్ణించాయి. ఒకవైపు కొత్త దేశపు సవాళ్లు, మరోవైపు ఆత్మశోధనతో సాగే ఈ ప్రవాస జీవన చిత్రం.. మనిషిని సున్నా నుండి శిఖరం వైపు ఎలా నడిపిస్తుందో ఈ వ్యాసంలో చూద్దాం. మానవ చరిత్రలో ప్రయాణం అనేది కేవలం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మారడం మాత్రమే కాదు; అది ఒక పరిణామ క్రమం. మెరుగైన ఉపాధి కోసమో, ఉన్నత చదువుల కోసమో లేదా కొత్త ప్రపంచాన్ని చూడాలనే తపనతోనో లక్షలాది మంది తమ మాతృభూమిని వదిలి పరాయి దేశాల్లో 'ప్రవాసులు'గా (Expats) స్థిరపడుతుంటారు. ఈ ప్రవాస జీవితం పైన కనిపించే రంగుల వెనుక ఎన్నో కఠిన వాస్తవాలు, మరియు ఆ వాస్తవాలను అధిగమించేలా చేసే గొప్ప ఆధ్యాత్మిక పాఠాలు దాగి ఉన్నాయి.

శూన్యం నుండి సృష్టి వరకు
(మళ్ళీ మొదటి నుండి మొదలుపెట్టడం)

విదేశాలకు వెళ్ళినప్పుడు మన పాత గుర్తింపు, హోదా అన్నీ వెనుకబడిపోతాయి. అక్కడ మనం కేవలం ఒక అపరిచితులం మాత్రమే. ఖురాన్ బోధించినట్లుగా, ప్రయాణం మనల్ని మొదట నిశ్శబ్దానికి గురిచేస్తుంది. ఈ నిశ్శబ్దం ఒంటరితనం కాదు, అది మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించుకునే సమయం. సున్నా నుండి మొదలుపెట్టడం అనేది ఒక సవాలు మాత్రమే కాదు, మనలోని అసలైన సామర్థ్యాన్ని పరీక్షించుకునే ఒక గొప్ప అవకాశం.

సరైన సంకల్పం - విజయానికి తొలి మెట్టు

ప్రవాస జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవాలంటే మన ప్రయాణ ఉద్దేశ్యం స్పష్టంగా ఉండాలి. కేవలం పాత సమస్యల నుండి తప్పించుకోవడానికి చేసే ప్రయాణం ఉపశమనాన్ని ఇవ్వదు. కానీ, జ్ఞాన సముపార్జన కోసం, కుటుంబ పోషణ కోసం లేదా దైవ సృష్టిలోని వైవిధ్యాన్ని అన్వేషించడం కోసం చేసే పయనం ఖచ్చితంగా సార్థకమవుతుంది. "ప్రయాణించండి, అన్వేషించండి" అన్న ఖురాన్ సందేశం మనల్ని ఎప్పుడూ కార్యోన్ముఖులను చేస్తుంది.

బాధ్యతాయుతమైన జీవనం

విదేశీ జీవితం అంటే కేవలం విహారయాత్ర కాదు. ఇక్కడ కూడా రోజువారీ పనులు, బిల్లులు, బాధ్యతలు ఉంటాయి. ఈ క్రమశిక్షణే మనిషిని పరిపూర్ణంగా తీర్చిదిద్దుతుంది..

మార్పును ఆహ్వానించడం

ప్రవాస జీవితం మనలో వినయాన్ని పెంచుతుంది. అనంతమైన ఈ ప్రపంచంలో మన స్థాయి ఎంత చిన్నదో ప్రకృతి మనకు బోధిస్తుంది. మన పాత అహంభావాన్ని, పాత స్వభావాన్ని వదిలివేసి, కొత్త పరిసరాలకు అనుగుణంగా మారడమే అసలైన సాహసం.

ప్రవాస జీవితం అనేది ఒక కఠినమైన పాఠశాల. ఇందులో ఒంటరితనం, భాషా సమస్యలు, కొత్త సవాళ్లు వంటి 'కఠిన వాస్తవాలు' ఉన్నప్పటికీ.. అన్వేషణ, జ్ఞానం మరియు ఆత్మ శోధన వంటి 'దివ్యమైన పాఠాలు' కూడా ఉన్నాయి. మన సంచిని కేవలం వస్తువులతోనే కాదు, సహనం మరియు కృతజ్ఞతతో నింపుకున్నప్పుడు, ప్రపంచంలో ఏ మూల ఉన్నా అది మనకు సొంత ఇల్లే అవుతుంది.

"ప్రయాణం మిమ్మల్ని ఒక అద్భుతమైన కథకుడిగా మారుస్తుంది." ఆ కథలో మీరు కథానాయకులుగా నిలవాలంటే, మార్పును స్వీకరించండి, అన్వేషణను కొనసాగించండి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

రాష్ట్రంలోనే మొదటిసారి శ్రవణ గ్రంథాలయం

- దృష్టి లోపి గలవారికి ఎంతో ఉపయోగకరం
- ప్రారంభించిన సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8 : దృష్టిలోపం (విజువల్లీ ఛాలెంజ్డ్) గల వారికి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్య, సమాచారం సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లాలో అంధుల శ్రవణ గ్రంథాలయం (సౌండ్ లైబ్రరీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో గురువారం అంధుల శ్రవణ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య,శాసనసభ్యులు చింతా ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సౌండ్ లైబ్రరీ ద్వారా దృష్టిలోపం గల వారు కంప్యూటర్ వినియోగం, పుస్తక పఠనం, ఇంటర్నెట్ బ్రౌజింగ్ వంటి కార్యకలాపాలను స్వయంగా నిర్వహించగలరని తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో కంప్యూటర్‌ను పూర్తి స్థాయిలో ఆపరేట్ చేయడం, చదువు, అభ్యాసం, డాక్యుమెంట్ల వినియోగం వంటి పనులు సులభంగా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ లైబ్రరీలో భారతీయ భాషల స్కాన్ అండ్ రీడ్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు.దీని ద్వారా విజువల్లీ ఛాలెంజ్డ్ విద్యార్థులు ముద్రిత పుస్తకాలను నేరుగా స్కాన్ చేసి చదవగలరని చెప్పారు. ఆఫ్‌లైన్‌తో పాటు గూగుల్ ఏఐ ఆధారిత ఆన్‌లైన్ విధానాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. దృష్టిలోపం గల వారి వినియోగానికి అనుగుణంగా 10 ఏంజెల్ ప్లేయర్లు (డీజీ ప్లేయర్లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా స్కాన్ చేసిన పుస్తకాలు, ఎడిటబుల్ ఫైళ్లు, పీడీఎఫ్ ఫార్మాట్లో ఉన్న పుస్తకాలను కాపీ చేసి వినియోగించుకోవచ్చని, కంప్యూటర్ అవసరం లేకుండానే తెలుగు, హిందీతో తదితర భారతీయ భాషల పుస్తకాలను ఆడియో రూపంలో వినే సౌకర్యం ఉందని, భారతీయ యాసతో స్పష్టంగా చదివే విధానం ఈ లైబ్రరీ ప్రత్యేక ఆకర్షణగా ఉందన్నారు. అలాగే బ్రెయిలీ ప్రింటింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంగ్లీష్ లేదా తెలుగు భాషల్లో ఉన్న పుస్తకాలను (పీడీఎఫ్, జేపీజీ లేదా ముద్రిత రూపంలో) బ్రెయిలీ లిపిలోకి మార్చి ముద్రించడం ద్వారా దృష్టిలోపం గల వారు బ్రెయిలీ లిపి ద్వారా పుస్తకాలను చదవగలరని వివరించారు.ఈ సౌండ్ లైబ్రరీ దృష్టిలోపం గల విద్యార్థుల విద్యా పురోగతి, స్వావలంబనకు తోడ్పడటంతో పాటు ఆధునిక సాంకేతికతను వారికి మరింత దగ్గర చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.శాసన సభ్యులు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, ఎక్కడా లేని విధంగా దృష్టిలోపం గల వారి కోసం జిల్లాలో శ్రవణ గ్రంథాలయం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. దివ్యాంగులు ఈ సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ ఆలోచన మేరకు ఈ సౌండ్ లైబ్రరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకున్నప్పుడే దీని సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో దివ్యాంగులు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు నిర్వహించి, ప్రత్యేక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వసుంధర, పంచాయతీ రాజ్ శాఖ డీఈ దీపక్, వివిధ దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, డీడబ్ల్యూఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో భద్రతా నియమాలు పాటించండి

- స్పీడో మీటర్లకు అమ్మ నాన్న స్టిక్కర్లను అంటించండి
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 8: నారాయణపేట జిల్లా కేంద్రం లో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో పాల్గొన్నారు రాష్ట్ర క్రీడా, పశుసంవర్థక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. జనవరి 1 నుండి ప్రారంభం అయిన ఈ కార్యక్రమంలో విద్యార్థులచే మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ మన దేశం లో ప్రతీ సెకండ్ కు ఒక ఆక్సిడెంట్ జరుగుతుందని, భద్రతా నియమాలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాల నుండి తప్పించుకోగల్గుతామని తెలిపారు. పేరెంట్స్ డ్రైవింగ్ చేసేటప్పుడు పిల్లలను, యువకులు డ్రైవింగ్ చేసేటప్పుడు ఇంట్లో తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలన్నారు. ఆక్సిడెంట్ వల్ల తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ను దేశ జట్టులో ఆడే అవకాశం కోల్పోయానని మంత్రి తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. మనం భద్రతా నియమాలు పాటించినా ఎదుటి వారు సేఫ్టీ గా రాకపోతే ఇరువురికి ప్రమాదమని తెలిపారు. మన శరీరం లో ప్రతీ అవయవం ముఖ్యమని అందుకే మనం డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి సేఫ్టీ నియమాలు పాటించాలన్నారు. బైక్ లు నడిపేటప్పుడు స్పీడో మీటర్ లకు అమ్మా, నాన్న అని ఉండే విధంగా స్టికర్లను అంటించాలని రవాణా అధికారులకు సూచించారు. లక్ష స్టికర్లకు తానే స్వయంగా డబ్బులు ఇస్తానని, వాటిని ప్రింట్ చేయించి ప్రతీ బైక్ కు అంటించాలని అధికారులను ఆదేశించారు. యువకులు బైక్ లపై స్టంట్లు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కోట శ్రీనివాసరావు,బాబు మోహన్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,అజహరుద్దీన్ వంటి ప్రముఖుల కుమారులు కూడా రోడ్డు ఆక్సిడెంట్ లో మృత్యువాత పడ్డారని మంత్రి గుర్తు చేశారు.

'గీతం'లో సంక్రాంతి సంబరాలు

- సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్నిప్రదర్శించిన విద్యార్థులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం సంక్రాంతి సంబరాలను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. మన దేశ గొప్ప వ్యవసాయ వారసత్వాన్ని ఈ వేడుకలు ప్రతిబింబించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల సంక్రాంతి సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించాయి. మొత్తంమీద పంటల వేడుక యొక్క రంగులు, సంప్రదాయాలు పండుగ స్ఫూర్తిని సజీవంగా నిలిపాయి. పలు విభాగాల విద్యార్థులు, అధ్యాపకుల మధ్య ఐక్యత, సామరస్యాన్ని సూచిస్తూ భోగి మంటలను వెలిగించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. గొబ్బెమ్మలతో అలంకరించిన సాంప్రదాయ రంగోలి (ముగ్గు) డిజైన్లు, గాలిపటాలు ఎగురవేయడం, సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు చేసిన ఆకర్షణీయమైన జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రాంగణమంతా ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదేశంగా మారింది. వ్యవసాయంలో రైతుకు అండదండలుగా నిలిచే పశువుల పట్ల కృతజ్ఞతను సూచించే తెలుగు రాష్ట్రాల విలక్షణమైన సంక్రాంతి ఆచారమైన సాంప్రదాయ గంగిరెద్దులు, పండుగ శోభను మరింత ఇనుమడింపజేశాయి. నేటి యువతకు పురాతన పంటల సంప్రదాయాలను పరిచయం చేయడానికి గాను ఎడ్ల బండి సవారీలు కూడా నిర్వహించారు. గీతంలోని ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్.. ఇలా అన్ని విభాగాల విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని, పండుగ అనుభవాన్ని మరుపురాని జ్ఞాపకంగా పదిలం చేసుకున్నారు. తెలుగు సంస్కృతి సారాన్ని ప్రతిబింబించే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉల్లాసభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రాంగణ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి.ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ పర్యవేక్షణలో, విద్యార్థి క్లబ్ అన్వేషణ ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించింది.

గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

- ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఖాన్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 8: గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్ అన్నారు. సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ గురువారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ఎదుట ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఔత్సాయిక క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ రవి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించే ఎందుకే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నారు. హనుమకొండ యువజన క్రీడా అధికారి గుగులోత్ అశోక్ కుమార్ మాట్లాడుతూ సీఎం కప్ టార్చ్ ర్యాలీ రెండు రోజులపాటు హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాలలో నిర్వహిస్తున్నమని చెప్పారు. మొదటి రోజు జీఎన్ఎస్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ పబ్లిక్ గార్డెన్ అదాలత్, హంటర్ రోడ్డు, నాయుడు పెట్రోల్ పంప్, మామునూర్, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, ఐనవోలు ఆర్చ్ నుండి జడ్.పి.హెచ్.ఎస్ పున్నేలు, ఐనవోలు, వెంకటాపూర్, వనమాల కనపర్తి, తరాలపల్లి, రాంపేట కడిపికొండ, జిహెచ్ఎస్ కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, జానకిపురం, మల్లికుదుర్ల, సోడషపల్లి, వేలేరు, కొత్తకొండ, ముల్కనూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్ పర్తి మీదుగా జేఎన్ఎస్ కు చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 9 వ తేదీన కమలాపూర్ మండలం అంబాల, గూడూరు, లక్ష్మీపూర్, శనిగరం, నడికూడ, పరకాల, కామారెడ్డి పల్లి, శాయంపేట, ఆరేపల్లి, తిరుమలగిరి ఆత్మకూరు, గూడెప్పాడ్, ఊరుగొండ, ఒగ్లాపూర్, దామెర, ఆరేపల్లి ములుగు రోడ్డు మీదుగా టార్చ్ ర్యాలీ తిరిగి హనుమకొండ లోని జె ఎన్ ఎస్ కు చేరుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనం కలెక్టర్ రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వరద రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- గుండాల సీఐ ఎల్. రవీందర్

ప్రతిపక్షం, గుండాల, జనవరి 8: రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండాల సీఐ ఎల్. రవీందర్ పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలేనని తెలిపారు. రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ ప్రాణ భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రత్యేకంగా రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. రోడ్డు మీద ప్రయాణించే సమయంలో మన భద్రత మన చేతుల్లోనే ఉంటుందని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని సీఐ పేర్కొన్నారు. అనంతరం సీఐ రవీందర్ పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులతో కలిసి రోడ్డు భద్రతపై భూసందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ద్వారా ట్రాఫిక్ నియమాల పాటింపు, రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గుండాల పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన కేయూ ఎస్ఐ శ్రీకాంత్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 8: కేయూ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌ను గురువారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒక పేకాట కేసు విషయంలో నిందితుడిని తప్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఎస్ఐ రూ. 15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు గురువారం సదరు లంచం డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మెదక్ రూపు రేఖలు మారాలంటే
మున్సిపల్‌పై బీజేపీ జెండా ఎగరాలి

- ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 8: మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే మెదక్ మున్సిపల్ రేపు రేఖలు మారాలంటే మెదక్ మున్సిపల్ పై బీజేపీ జెండా ఎగరవేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. బుధవారం మెదక్ బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నహాక సమావేశమునకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత పట్టణాలన్ని అభివృద్ధి చెందిన మెదక్ పట్టణం మేజర్ గ్రామపంచాయతీగానే అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో డిప్యూటీ స్పీకర్ గా ఎమ్మెల్యేగా పనిచేసిన పద్మాదేవేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి అనుచరుడిగా రాజకీయ కార్యదర్శిగా ఎమ్మెల్సీగా ఉన్న సుభాష్ రెడ్డిలు మెదక్ పట్టణ అభివృద్ధి విషయం మర్చిపోయారని, ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదని, అండర్ డ్రైనేజీ సిస్టం, రింగ్ రోడ్డు వంటి పనులు చేయలేకపోయారన్నారు. సుమారు 35 వేల జనాభా ఉన్న మెదక్ పట్టణం అభివృద్ధి నోచుకోలేకపోయిందని కేవలం 20 వేల జనాభా ఉన్న గజ్వేల్ పట్టణం రింగ్ రోడ్డు వేయడం జరిగిందని ఆయన టిఆర్ఎస్ పార్టీని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ మూలంగానే పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందుకే మెదక్ మున్సిపల్ పై బీజేపీ జెండా ఎగురవేయాలని అయినా తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్లస్ మల్లేష్ గౌడ్ జగిత్యాల జిల్లా ఇంచార్జ్ గడ్డం శ్రీనివాస్ మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహా రెడ్డి ,మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, చోళ రామ్ చరణ్ యాదవ్ ,జిల్లాకార్యదర్శి కల్కి నాగరాజు ,సంగీత,నందరెడ్డి,ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్,బీజేవైఎం సతీష్ ,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎంఎల్ఎన్ రెడ్డి, నల్లల విజయ్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్,, ముక్క సుధాకర్ , బెండ వీణ ,లోకేష్ వేణు , శివ,అల్లం మధు ,అంకం శ్రీనివాస్ మనోజ్, సుంకోజి రాజు ,ఆంజనేయులు,ఆఫీస్ సెక్రటరీ సాయి కిరణ్ , తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతలతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదు

- ఏకాభిప్రాయం తెలిపిన ప్రజా ప్రతినిధులు, రైతులు,రైతు సంఘాల సభ్యులు
- మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పై ముగిసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 8: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి దామరగిద్ద తండా లో గురువారం ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. మూడు నియోజకవర్గాల నుంచి మూడు నియోజకవర్గాలలోని 7 మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అందరూ ముక్త కంఠంతో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి పర్యావరణ ముప్పు, విఘాతం లేదని, వీలైనంత తొందరగా ఆ పథకానికి పర్యావరణ అనుమతులు ఇచ్చి ప్రారంభించాలని ఏకాభిప్రాయాన్ని తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పి సి బి) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఈ ఈ సురేష్ హాజరు కాగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, నీటి పారుదల శాఖ ఎస్. ఈ శ్రీధర్ పాల్గొన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ లో భాగంగా ఏడు మండలాల నుంచి వచ్చిన వందలాది మంది సమక్షంలో 28 మంది వక్తలు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందరూ మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తొందరగా ప్రారంభించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, ఆ పథకం పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆ పథకం చేపడితే పర్యావరణానికి వచ్చే నష్టం ఏమీ లేదని, గాలి, నీరు, వాతావరణ కాలుష్యం ఏమీ జరగదని తేల్చి చెప్పారు. ఆ పథకం పూర్తి అయితే పర్యావరణం ఇంకా మెరుగు అవుతుందని తెలిపారు. వెంటనే పథకం ప్రారంభించేందుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని అధికారి సురేష్ ను వారు కోరారు. చివర్లో అధికారి సురేష్ మాట్లాడుతూ. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వచ్చిన అభిప్రాయాలన్నింటిని నమోదు చేసుకున్నామని, మొత్తం కార్యక్రమాన్ని వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, మీటింగ్ మినిట్స్ తో పాటు వీడియో ను కాలుష్య నియంత్రణ మండలి కి సమర్పిస్తామని తెలిపారు. ఆ పథకంలో ఊట్కూర్ గ్రామం ముంపునకు గురయ్యే ఆస్కారమే లేదని, ఊట్కూరు మండల పరిసరాలలో సంచరించే జింకలను సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని నీటి పారుదల శాఖ ఎస్. ఈ. శ్రీధర్ ఓ ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈ ఈ బ్రహ్మానందరెడ్డి, పర్యావరణ కన్సల్టెన్సీ కరీముల్లా, దామరగిద్ద తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో జయలక్ష్మి, దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్ నాయక్, దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, బాపన్ పల్లి శ్రీను, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు రైతు సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

“

అమెరికా క్రమంగా దాని మిత్ర దేశాల్లో కొన్నింటి నుంచి దూరం జరుగుతోంది. ఇంత కాలం అది ప్రోత్సహిస్తూ వచ్చిన అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘిస్తోంది. కొత్త వలసవాదం, సామ్రాజ్యవాదాన్ని ఫ్రాన్స్ తిరస్కరిస్తుంది.

- ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

ప్రాంతీయం

సిద్దిపేట జిల్లాలో సీఐల బదిలీలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట జనవరి 8: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న విద్యాసాగర్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ప్రభుత్వ రైల్వే పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టి. లక్ష్మీ బాబును త్రీటౌన్ నూతన సీఐగా నియమించారు.గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించగా, ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న డి. రవిరాజును నియమించారు. అలాగే చేర్యాల సీఐ ఎల్. శ్రీనును ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసి, ఆయన స్థానంలో కరీంనగర్ పీటీసీలో విధులు నిర్వహిస్తున్న బానోతు రమేష్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీపీ విజయ్‌కుమార్‌ను
కలిసిన సిద్దిపేట సీనియర్ జర్నలిస్టులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 8: బదిలీపై వెళ్తూ పదోన్నతి పొందిన సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను సిద్దిపేట సీనియర్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ విజయ్‌కుమార్‌కు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సీపీగా ఆయన పనిచేసిన కాలంలో సిద్దిపేట జిల్లా ప్రశాంతంగా ఉండిందని, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన సేవలు అభినందనీయమని జర్నలిస్టులు పేర్కొన్నారు. సీపీని కలిసిన వారిలో జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు కె. రంగాచారి, సీనియర్ జర్నలిస్టులు అయ్యమ్మగారి సత్యనారాయణ రెడ్డి, మదూరి శ్రీరామ్, నెలుట్ల రమణారావు, మహేష్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ర్యాలీలో పాల్గొన్న అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 8: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2026 లో భాగంగా గురువారం నాడు గజ్వేల్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారి 161 (ఏ ఏ) పైన గజ్వేల్ కోర్టు నుండి పిడిచేడ్ క్రాస్ రోడ్ వరకు గజ్వేల్ అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్ మనివీర్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, గజ్వేల్ పోలీస్ ఇన్స్పెక్టర్ రవికుమార్, మరియు గజ్వేల్ కోర్ట్ అడ్వకేట్లు పోలీస్ సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ సూపరిండెంట్లు జ్యోతింద్రనాథ్ రెడ్డి, హనుమంత రెడ్డి, మరియు కోర్టు సిబ్బంది గజ్వేల్ బార్ అసోసియేషన్ అడ్వకేట్లు, ప్రజలు వాహనదారులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంజేపీ విద్యార్థి ఎంపిక

ప్రతిపక్షం, దౌల్తాబాద్, జనవరి 8: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 19 జాతీయ స్థాయి హాకీ పోటీలకు దౌల్తాబాద్ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర కళాశాల విద్యార్థి చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల సరూర్ నగర్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈనెల 12న రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్ లో జరిగే పోటీలలో తెలంగాణ హాకీ జట్టు తరపున పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు, దౌల్తాబాద్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కళాశాల విద్యార్థి జాతీయస్థాయిలో ఎంపిక అయ్యేవిధంగా మంచి శిక్షణ ఇచ్చిన కళాశాల పిడి సాయికృష్ణ, పిఈటిలు డాంబు, బసవరాజులను అభినందించారు.

పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 8: రామేశ్వరం పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆంగ్ల భాషోపాధ్యాయుడు గా విధులు నిర్వర్తిస్తున్న నీలం శ్రీనివాస్ తన స్వంత డబ్బులతో పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ఆన్వేల్ పరీక్షల నిమిత్తం స్టడీ మెటీరియల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాస్ , రామేశ్వరంపల్లి గ్రామ సర్పంచి రజిత కుమార్ ల సమక్షంలో పంపిణీ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15లోగా ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 8: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఇజిఎస్) కింద జిల్లాలో చేపట్టిన అన్ని నిర్మాణ పనులను ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంఎన్ఆర్ఇజిఎస్ పనుల ప్రగతి పై ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రహదారులు, ఫామ్ పాండ్లు, ప్లాంటేషన్లు, నర్సరీలు, ఇంకుడు గుంతలు, ఫారెస్ట్ స్ట్రక్చర్లు తదితర అన్ని పనులను లక్ష్యాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు పేమెంట్లు వేగంగా అందేలా చూడాలని తెలిపారు. అన్ని మండలాల్లో టెక్నికల్ అసిస్టెంట్ల సేవలను సమర్థంగా వినియోగించుకునేలా రెండు రోజుల్లో అడ్జస్ట్ చేస్తామని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు తప్పనిసరిగా పని దినాలు కల్పించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా, జెడ్పి సీఈఓ రమేష్, డీపీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ మ్యాపింగ్ 100 శాతం పూర్తి చేయాలి

జిల్లాలో ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, తహసిల్దార్లు, సూపర్వైజర్లు, బిఎల్‌ఓలతో జూమ్ సమావేశం ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారిగా మ్యాపింగ్‌లో వెనుకబడి ఉన్న బిఎల్‌ఓల పనితీరును పరిశీలించారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఎలక్టోరల్ మ్యాపింగ్ మందగమనం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, వచ్చే రెండవ శనివారం, ఆదివారం సెలవులు తీసుకోకుండా సూపర్వైజర్లు, బిఎల్‌ఓలు మ్యాపింగ్ పనులు చేయాలని ఆదేశించారు. తహసిల్దార్లు సూపర్వైజర్లు, బిఎల్‌ఓల పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీల ద్వారా వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిరోజు చేసిన మ్యాపింగ్ వివరాలను కంప్యూటర్‌లో అప్లోడ్ చేసే ప్రక్రియను కూడా సమీక్షించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ నాగరాజమ్మ, సిపిఓ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి మాస్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 20,041 మంది ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు 42 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 9,946 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 10,095 మంది ఉన్నారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, శాఖలకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాలకు తరలింపు, జవాబు పత్రాల రవాణా, పోలీస్ బందోబస్తు బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష రోజులలో నిరంతర విద్యుత్ సరఫరా, విద్యార్థులకు రవాణా సౌకర్యం, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, అడిషనల్ డీసీపీ కుషాల్కర్, డీఆర్‌డీఓ నాగరాజమ్మ, డీఈవో శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

వల్లంపట్లలో 11వ శతాబ్దపు గణపతి రాతి విగ్రహం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 8: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో పునర్నిర్మాణం జరుగుతున్న దేవాలయం సమీపంలో పురాతన విడి శిల్పాలున్నాయి. కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశోధకసభ్యుడు సామలేటి మహేశ్ ఈ శిల్పాలను పరిశీలించాడు. ఇక్కడి 5 అడుగుల ఎత్తున్న చతుర్భుజ గణపతి శిల్పం ఎంతో ప్రత్యేకం. లలితాసనంలో ఆసీనుడైన గణపతి పరహస్తాలలో పరశువు, పుష్పం, నిజహస్తాలలో విరిగిన దంతం, కుడుములతో ఎడమవైపు తిరిగున్న తొండంతో, పొట్టమీద నాగబంధంతో, మూషికవాహనుడై అగుపిస్తున్నాడు. వెనకవైపున పుష్పం, భుజంపైనుంచి జంధ్యం కనిపిస్తున్నాయి. ఈ విగ్రహం అలంకరణలశైలి, శిల్పరూపం రీత్యా 11వ శతాబ్దం, చాళుక్యుల కాలం నాటిదని తెలుస్తోంది. అరుదుగా కనిపించే గణపతి శిల్పం ఈ గ్రామంలో కనిపించడంతో ఈ ప్రాంతంలో కాలాముఖ శైవం, గాణపత్యం విస్తరించి వుంటాయని చెప్పవచ్చు.

చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం

చేగుంట, ప్రతిపక్షం, జనవరి 8: చేగుంట మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. లైన్స్ క్లబ్ డి ఎస్ దేవ లింగమూర్తి ఆధ్వర్యంలో తూప్రాన్ మండలం ఆబోతుపల్లి లో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్ లింగమూర్తి మాట్లాడుతూ ఇలాంటి పశువైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో లైన్స్ క్లబ్ నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ ఆకుల సుఖేందర్ చేగుంట లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శంభుని శ్రీనివాస్ వెటర్నరీ డాక్టర్ లక్ష్మి వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లోనే

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 8: పదో తరగతి నుంచే విద్యార్థుల భవిష్యత్తు ప్రారంభమవుతుందని, ఈ కీలక సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మార్చిలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్షలకు ముందు పిల్లలపై తల్లిదండ్రులు తీసుకునే జాగ్రత్తలే వారి భవిష్యత్తును నిర్దేశిస్తాయని చెప్పారు. ఈ మూడు నెలలు పిల్లలను పూర్తిగా చదువుపై దృష్టి పెట్టేలా చూడాలని సూచించారు. సెల్ ఫోన్లు, టీవీలు, సినిమాలు, విందులు, వినోదాలు, ఫంక్షన్లకు దూరంగా ఉంచాలని, అలాగే ఇంటి పనులు, వ్యవసాయ పనులకు కూడా పిల్లలను ఉపయోగించవద్దని తల్లిదండ్రులను కోరారు. సిద్దిపేట నియోజకవర్గం విద్యారంగంలో ఇప్పటికే ఆదర్శంగా నిలిచిందని, గత కొన్ని సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలో 169 మంది విద్యార్థులు సీట్లు సాధించడమే కాకుండా, పలువురు మెడికల్, ఇంజనీరింగ్ రంగాల్లో స్థిరపడటం గర్వకారణమన్నారు. విద్యార్థుల విజయానికి తన వంతు బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు, సాయంత్రం అల్పాహారం, డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకంగా ఒక టీచర్‌ను నియమించామని, అవసరమైతే గ్రామ సర్పంచ్‌లను కూడా విద్యార్థుల ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యుడిగా కూడా విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్నానని హరీష్ రావు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా సహకరించాలని ఆయన కోరారు.

పక్కా ప్రణాళికతో మున్సిపల్ ఎన్నికలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 8: పకడ్బందీగా, పక్కా ప్రణాళికతో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మెదక్ మున్సిపల్ ఎన్నికల ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పకడ్బందీగా మున్సిపల్ పక్క ప్రణాళికతో నిర్వహించాలని, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఉండవలసిన అన్ని సౌకర్యాలు కల్పించాలని,అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగులందరికీ సమాన వేతనం, పెన్షన్ కల్పించాలి

- జేఏసీ డిమాండ్



ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 8: తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల మనుగడకు, ఆధ్యాత్మిక వైభవానికి మూలస్తంభాలైన అర్చకులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి సమావేశం రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, కన్వీనర్ డి.వి.ఆర్. శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడుతూ దేవాదాయ శాఖలో నెలకొన్న వేతన వ్యత్యాసాలను, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదాయం ఆర్జిస్తున్న 686 దేవాలయాల్లో వేలాది మంది సిబ్బంది దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నార ని వీరిలో అత్యధికులు నేటికీ కేవలం రూ.1500 నుండి రూ.6000 మధ్య వేతనాలతో నిరుపేద జీవితాలను గడుపుతున్నార ని అన్నారు. దేవాలయ ఉద్యోగులకు అర్చకులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పూర్తిస్థాయి అమలు జీవో 577 ప్రకారం అర్హత ఉన్న 5625 మంది అర్చక ఉద్యోగులకు తక్షణమే గ్రాంట్ ఇన్ ఎయిడ్ వర్తింపజేయాలని, ప్రస్తుతం కేవలం 2622 మందికి మాత్రమే ఈ ప్రయోజనం అందుతోందని, సాంకేతిక కారణాలు నిబంధనల సాకుతో మిగిలిన 3000 మందికి పైగా సిబ్బందిని విస్మరించడం సరికాదని అన్నారు. దేవాలయాల్లో మూడు సంవత్సరాల కనీస సర్వీసు పూర్తి చేసుకున్న తాత్కాలిక, దినసరి వేతన ఉద్యోగులను మానవీయ దృక్పథంతో రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. దేవాదాయశాఖలో అధికారులకు ప్రభుత్వ ఖజానా నుండి జీతాలు, పెన్షన్లు అందుతున్నాయని, అదే శాఖలోని ఆలయ అర్చకులకు ఈ సౌకర్యం లేదని ఒకే శాఖ ఒకే వేతన విధానం అమలు చేయాలని అన్నారు. పదవీ విరమణ చేసిన అర్చకులకు పెన్షన్ సౌకర్యం, పీఆర్సీ, ఇంక్రిమెంట్లు, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని అన్నారు. ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు నిర్వహించే వారి ఆరోగ్యానికి భరోసా కల్పించాలని అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని యెడల రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయశాఖ అధ్యక్షులు కృష్ణమాచారి, ఉద్యోగ సంఘమ్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నరసింహ రెడ్డి, దేవాలయ స్థానాచార్యులు మల్లన్న స్వామి, ప్రధాన అర్చకుడు మల్లికార్జున్ ఉప ప్రధాన అర్చకులు సాంబయ్య, పీ.మల్లికార్జున్ భాస్కర్, రవి, వినయ్, బసవేశ్వర్, సాయి, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, దేవాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ఉమ్మడి జిల్లా దేవాలయాల సుమారు 400 మంది అర్చక ఉద్యోగులు పాల్గొన్నారు.



"

నదీగర్భంలో రాజధాని కట్టట్లేదు. వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అమరావతి ఆగదు. తప్పుడు ప్రచారం చేస్తే ఈ సారి ఆ 11 సీట్లు కూడా రావు. రెండవ విడత భూసేకరణలో భాగంగా భూమి ఇవ్వడానికి రైతులు ముందుకొస్తున్న టైమ్ లో ఇలాంటి కామెంట్స్ చేయడం దారుణం. సీఎంగా పని చేసిన వ్యక్తి ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదు.

- ఏపీ మంత్రి నారాయణ

విశ్వ వీక్షణం

గ్రీన్‌ల్యాండ్ కొనేస్తాం: అమెరికా

డెన్మార్క్ దేశంలోని గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని కొనే దిశగా అమెరికా కసరత్తును ముమ్మరం చేసింది. దీనిపై ఆ దేశ ప్రభుత్వంతో చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వచ్చే వారం డెన్మార్క్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈవిషయాన్ని గ్రీన్‌లాండ్ ప్రాంతీయ ప్రభుత్వ వెబ్‌సైట్ మంగళవారమే ధ్రువీకరించింది. డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోక్కే రస్మ్యూసెన్, గ్రీన్‌లాండ్ విదేశాంగ మంత్రి వివియన్ మోట్జ్ ఫెల్ట్‌ల విన్నపం మేరకు డెన్మార్క్ పర్యటనకు రూబియో వస్తున్నారని వెల్లడించింది. ఈ సున్నితమైన అంశంపై చర్చ కోసం డెన్మార్క్‌కు రావాలని ఇంతకుముందు పలుమార్లు ప్రభుత్వం విన్నవించినప్పటికీ అమెరికా తిరస్కరించిందని తెలిపింది. సోమవారం సాయంత్రం వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో పలువురు అమెరికా కాంగ్రెస్ సభ్యులతో ఓ ప్రైవేటు సమావేశం జరిగింది. అందులో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారంటూ మంగళవారం 'వాల్ స్ట్రీట్ జర్నల్' సంచలన వార్తను ప్రచురించింది. ఎలాగైనా డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కొనేయాలనే స్పష్టమైన ఆలోచనతో ప్రెసిడెంట్ ట్రంప్ ఉన్నారనే విషయాన్ని రూబియో చెప్పారని ఆ వార్తలో ప్రస్తావించారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సైనిక చర్యను చేపట్టొద్దనే బలమైన అభిప్రాయం వ్యక్తమవుతున్నందున, దాన్ని కొనేయాలనే అభిప్రాయానికి ట్రంప్ వచ్చారని రూబియో తెలిపినట్లు వార్తలో పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం తమ వద్ద అన్ని మార్గాలు సిద్ధంగా ఉన్నాయని మంగళవారం రోజు వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ కెరోలిన్ లీవిట్ వెల్లడించారు. అయితే దౌత్యానికే ప్రెసిడెంట్ ట్రంప్ తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె తెలిపారు.

కొల్‌కతాలో ఐప్యాక్‌పై ఈడీ దాడులు

- కీలక పత్రాలు,హార్డ్ డిస్కులు తెచ్చుకున్న మమత
- బెంగాల్ రాజకీయాల్లో హైడ్రామా

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, కోల్‌కతా, జనవరి 8: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తనిఖీలు చేశారు. కోల్‌కతాలోని ఆయన ఇంట్లో గురువారం ఈడీ అధికారులు సోదాలు చేశారు. బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. ఉదయం నుంచి ఆయన నివాసంతోపాటు ఐప్యాక్‌కు సంబంధించిన పలు ప్రాంగణాల్లో దాడులు చేసింది. అయితే, సోదాలు జరుగుతున్న సమయంలోనే బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈడీ అధికారులు జైన్ నివాసంలో తనిఖీలు చేస్తుండగా.. మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ మనోజ్ వర్మతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. ఈడీ సోదాలు రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ కుట్ర లో భాగంగానే తమ పార్టీ ఐటీ సెల్ ఇన్‌చార్జి ప్రతీక్ జైన్ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ''మా పార్టీ రాజకీయ వ్యూహం, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని చోరీ చేసేందుకే ఈడీతో దాడులు చేయిస్తున్నారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌లను తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు'' అని మమత ఆరోపించారు. రాజకీయ పార్టీ సమాచారాన్ని సేకరించడమే ఈడీ పనా? అని నిలదీశారు. రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం ఇలా ఈడీతో దాడులు చేయిస్తోందని ఆరోపించారు. బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఐప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు జరుపుతుండగా.. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వచ్చి కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని ఈడీ ఆరోపించింది. కొన్ని పత్రాలతో పాటు హార్డ్ డిస్క్‌లను కూడా ఆమె ఎత్తుకెళ్లిపోయారని ఓ ప్రకటనలో తెలిపింది. ఐప్యాక్ కార్యాలయం నుంచి మమత, ఆమె అనుచరులు, పోలీసులు బలవంతంగా పత్రాలు, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లిపోయారని పేర్కొంది. . కాగా, తమ విచారణకు అడ్డంకులు సృష్టించారన్న ఆరోపణలపై పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఈడీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. విచారణలో సీఎం జోక్యం చేసుకోవడాన్ని ప్రశ్నించింది. విచారణలో తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోర్టును కోరింది.

ప్రమాదాల నివారణకు కార్లలో వైర్‌లెస్ వ్యవస్థ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాదాల నివారణకు వెహికిల్ టు వెహికిల్ (వీ2వీ) సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. డ్రైవర్‌కు రియల్‌టైంలో సమీపంలోని ఇతర వాహనాలు, స్పీడు, ప్రమాదకర ప్రాంతాలు తదితర వివరాలు పంపించి, తగిన హెచ్చరికలు చేయడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. టెలికమ్యూనికేషన్ల శాఖ సహాయంతో దీన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. గురువారం ఇక్కడ జరిగిన రాష్ట్రాల రవాణా మంత్రుల వార్షిక సదస్సు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచారం పంపించడం కోసం కార్లలో వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ఉంటుందని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో తగిన మార్పులు చేయడం ద్వారా ప్రమాదాలు తగ్గిస్తామని తెలిపారు.

ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటించడం కోసం మోటారు వాహనాల చట్టంలో 61 సవరణలు తీసుకొస్తామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి నగదు రహిత విధానంలో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చే స్తామని గడ్కరీ తెలిపారు. ఈ విధానాన్ని త్వరలో ప్రధాని మోదీ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఇప్పటికే ఈ విధా నం ఆరు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్నట్టు తెలిపారు. క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందక మరణాలు సంభవిస్తున్నందున దాన్ని నివారించడానికే నగదు రహిత వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి రూ.1.5 లక్షల మేర, గరిష్ఠంగా వారంరోజుల పాటు చికిత్సలు అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు.

వీధుల్లోంచి ప్రతి కుక్కను తరలించాలని మేం చెప్పలేదు

- వీధికుక్కల విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 6: వీధుల్లో ఉండే ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, జంతువుల జనన నియంత్రణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సుప్రీం కోర్టు పేర్కొంది. కుక్కలు తమకు భయపడేవారిని లేదా గతంలో కుక్కకాటుకు గురైన వారిని వాసన చూసి వారిపై దాడి చేస్తాయని వీధికుక్కల కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని సుప్రీం ధర్మాసనం గుర్తుచేసింది. సున్నితమైన ప్రదేశాల్లో భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన సుప్రీం కోర్టు, ఆసుపత్రి వార్డుల్లో, రోగుల చుట్టూ కుక్కలు సంచరించడానికి అనుమతించాలా అని ప్రశ్నించింది. శునకాలను వీధుల నుంచి తరలించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వీధుల నుంచి ప్రతి కుక్కను తరలించాలని తాము ఆదేశించలేదని, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని మాత్రమే ఆదేశించినట్లు జస్టిస్ మెహతా పేర్కొన్నారు. దేశ రాజధాని దిల్లీలో కుక్కకాటు వల్ల ముఖ్యంగా చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నట్లు మీడియా కథనాలు వెలువడటంతో గతేడాది జులై 28న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు తదితర జన సమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చేయాలని గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

ఆరోగ్యదాయిని వెల్లుల్లి..

ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు..

మరి వెల్లుల్లి చేసే మేలు..?

కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయాలు మీ కోసం



మీ ఆరోగ్యానికి కావలసిన వన్నీ మీ వంటగదిలో తప్ప మరెక్కడా ఉండవని మీకు తెలుసా..? అయితే వంటగదికి సంబంధించి ఒక మంచి ఆరోగ్యకరమైన వస్తువు గురించి తెలుసుకుందాం.. అదే పచ్చి వెల్లుల్లి. వెల్లుల్లి రెబ్బలను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. ఆ ప్రయోజనాల గురించి అందరూ తప్పక తెలుసుకోవాలి. వెల్లుల్లి దాని ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందింది. ఈ చిన్న మొగ్గ అనేక వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తుంది. ముఖ్యంగా, ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు అందుతాయి.

గుండె ఆరోగ్యానికి వరం

- వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే సమ్మేళనం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ధమనులను శుద్ధి చేయడం ద్వారా రక్త ప్రసరణను సాఫీగా జరిగేలా సహకరిస్తుంది.
- వెల్లుల్లి చెడు కొలెస్ట్రాల్ (LDL)ని తగ్గించడం ద్వారా గుండెపోటు మరియు స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- వెల్లుల్లి రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది

వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్స్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని బలో చేస్తాయి. ఇది జలుబు, దగ్గు ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది.



జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది

- వెల్లుల్లి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
- వెల్లుల్లి మలబద్ధకం నుండి ఉపశమనం అందించడంలో సహాయపడుతుంది, కడుపు ఇతర సమస్యలపూ తగ్గిస్తుంది.
- హెలికోబాక్టర్ పైలోరీ బాక్టీరియాతో పోరాడుతుంది. ఈ బాక్టీరియా కడుపు పూతలకి కారణమవుతుంది. వెల్లుల్లి ఈ బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది.

క్యాన్సర్ నుంచి రక్షణ

వెల్లుల్లిలో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే అనేక సమ్మేళనాలు ఉన్నాయి. ఇది ముఖ్యంగా కడుపు, పెద్దప్రేగు రొమ్ము క్యాన్సర్ ను నిరోధించేందుకు దివ్యౌషధంగా పనిచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇవి గుర్తుంచుకోండి

- కొందరికి వెల్లుల్లి వల్ల అలర్జీ రావచ్చు. కాబట్టి, మీకు వెల్లుల్లి అలెర్జీ అయితే, దానిని తినవద్దు.
- వెల్లుల్లి కొన్ని మందులతో పాటు వాడితే రియాక్షన్స్ కలగవచ్చు. అందువల్ల, మీరు ఏదైనా మందులు తీసుకుంటుంటే, పచ్చి వెల్లుల్లిని తినడానికి ముందు మీ వైద్యుడిని సంప్రదించండి.
- వెల్లుల్లి రక్తాన్ని పలుచన చేసే మందుల ప్రభావాన్ని పెంచుతుంది.

ఎలా వాడాలి... ఎంత తినాలి?

మీరు ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తినవచ్చు. కావాలంటే నమిలి తినవచ్చు లేదా పెరుగు లేదా తేనె కలుపుకుని తినవచ్చు.

వ్యాసంలో పేర్కొన్న సలహాలు మరియు సూచనలు సాధారణ సమాచార ప్రయోజనాల కోసం మాత్రమే.. వృత్తిపరమైన వైద్య సలహాగా భావించకూడదు. మీకు ఏవైనా ప్రశ్నలు లేదా ఆందోళనలు ఉంటే, ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.

ఇంకా చాలా ప్రయోజనాలు ఉన్నాయి

- వెల్లుల్లి జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.
- వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి, ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.
- వెల్లుల్లి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. చుండ్రును తగ్గిస్తుంది.

నేటి నుండి మహిళల ప్రీమియర్ లీగ్

ఐదు జట్లు పోటీపడనున్న మహిళల ప్రీమియర్ లీగ్ ఫిబ్రవరి 5 వరకు జరుగుతుంది. స్థానిక డీవై పాటిల్ స్టేడియంలో జరిగే నేటి ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. 2024లో ఆర్‌సీబీ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దేశవాళీ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఆరంభించిన ఈ లీగ్ ఇప్పటికే సత్ఫలితాలనిస్తోంది. దీనిద్వారా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న షఫాలీ, రిచా, శ్రేయాంక, శ్రీచరణి, క్రాంతి, సైకా తదితరులు కీలక ప్లేయర్లుగా కొనసాగుతున్నారు. అందుకే మరింత మంది యువ ప్లేయర్లు తమ సత్తా నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు పొట్టి ఫార్మాట్‌లో జరిగే డబ్ల్యూపీఎల్ ద్వారా భారత్‌తో పాటు ప్రపంచ క్రికెటర్లకు కూడా జూన్‌జూలైలో జరిగే టీ20 వరల్డ్‌కపనకు చక్కటి ప్రాక్టీస్ లభించనుంది. తాజా సీజన్ కోసం గతేడాది నవంబరులో జరిగిన మెగా వేలం ద్వారా ఆయా జట్లు కొత్త ప్లేయర్లతో బరిలోకి దిగబోతున్నాయి. ఈనేపథ్యంలో ఢిల్లీని గత మూడు పర్యాయాలు ఫైనల్‌కు చేర్చిన కెప్టెన్ మెగ్ లానింగ్ ఇప్పుడు యూపీ వారియర్స్‌ను నడిపించబోతోంది. జెమీమా ఢిల్లీ కొత్త కెప్టెన్ అయ్యింది. అయితే ఎలిస్ పెర్రీ (ఆర్‌సీబీ), అన్నాబెల్ సదర్లాండ్ (డీసీ) వ్యక్తిగత కారణాలతో డబ్ల్యూపీఎల్‌కు దూరం కావడం ఆయా జట్లకు గట్టి ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. గతేడాది మ్యాచ్‌లను నాలుగు నగరాల్లో నిర్వహించగా.. ఈసారి మాత్రం తొలి రెండు సీజన్ల మాదిరే రెండే వేదికలకు పరిమితం చేశారు. దీంతో రెండు దశల్లో జరిగే ఈ లీగ్‌కు మొదట నవీ ముంబై ఆతిథ్యమివ్వనుంది. ఇక్కడి డీవై పాటిల్ స్టేడియంలో జనవరి 17 వరకు 11 మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్‌లో ఏకైక డబుల్ హెడర్ మ్యాచ్‌లు (జనవరి 10న) ఇక్కడే నిర్వహిస్తారు. ఆ తర్వాత వేదిక వడోదరకు మారనుంది. ఇక్కడ 19 నుంచి వచ్చే నెల 5 వరకు ఎలిమినేటర్, ఫైనల్ సహా మరో 11 మ్యాచ్‌లతో లీగ్ ముగియనుంది.

తిలక్ వర్మకు సర్జరీ.. న్యూజీలాండ్ సిరీస్‌కు దూరం

ప్రపంచ కప్‌నకు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగి లింది. జట్టు ఆపద్బాంధవ బ్యాటర్ తిలక్ వర్మకు పొత్తి కడుపు గాయమైంది. దాంతో అతడికి శస్త్రచికిత్స నిర్వహించారు. ఫలితంగా అతడు కొద్ది రోజులు ఆటకు దూరం కానున్నాడు. గాయం దరిమిలా న్యూజిలాండ్‌తో జరిగే తొలి మూడు టీ20లలో తిలక్ వర్మ ఆడడంలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా గురువారం రాత్రి తెలిపాడు. 23 ఏళ్ల తిలక్ వర్మ ప్రస్తుతం రాజ్ కోట్ లో జరుగుతున్న విజయ్ హజారే టోర్నీలో ఆడుతున్నాడు. బెంగాల్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. అయితే బుధవారం తిలక్‌కు హఠాత్తుగా పొత్తి కడుపులో తీవ్రంగా నొప్పి వచ్చింది. 'తిలక్‌ను రాజ్‌కోట్‌లోని ఆసుపత్రికి తరలించగా, వెంటనే ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. ఆమేరకు అతడికి శస్త్రచికిత్స జరిగింది. ఆపరేషన్ తర్వాత అతడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు' అని సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు జయదేవ్ షా వెల్లడించాడు. అతడు కోలుకొనే తీరు ఆధారంగా న్యూజిలాండ్‌తో మిగిలిన టీ20లు ఆడించే విషయంపై నిర్ణయం తీసుకుంటారన్నాడు.

జాతీయ బాక్సింగ్‌టోర్నీ.. సెమీస్‌లో నిఖత్

జాతీయ సీనియర్ బాక్సింగ్ టోర్నీలో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్‌తో పాటు మీనాక్షి హుడా, హితేశ్ గులియా టైటిల్ పోరు చేరువయ్యారు. మహిళల 4851కిలోల విభాగంలో నిఖత్ జరీన్ 50తో లాల్‌చెన్బీ చాను తొంగ్రామ్‌పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన నిఖత్..ప్రత్యర్థిపై పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడింది. ఈ క్రమంలో టైటిల్‌కు మరింత చేరువైంది. మిగతా క్వార్టర్స్ బౌట్లలో మీనాక్షి 50తో కశిష్ మెహతాపై, పవన్ 50తో టైసన్‌పై, జాదుమణి 50తో నిఖిల్‌పై, సచిన్ 50తో కరణ్‌పై, ప్రీతి 50తో హర్మీత్‌కౌర్‌పై, సాక్షి 41తో పూనమ్‌పై, హితేశ్ 50తో తేజస్విపై గెలిచి టోర్నీలో ముందంజ వేశారు.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

క్వార్టర్స్‌లో సింధు, సాత్విక్

కొత్త ఏడాదిలో భారత షట్లర్ పీవీ సింధు గొప్పగా ఆడుతోంది. మలేషియా ఓపెన్ సూపర్ 1000లో దూకుడు కనబరుస్తున్న సింధు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అదిరే ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్స్ బెర్తు సాధించింది. అయితే.. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టిల పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేతైన సింధు నిరుడు ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. కానీ, కొత్త ఏడాదిలో తను అనూహ్యంగా పుంజుకుంది. మలేషియా ఓపెన్‌లో చెలరేగిపోతున్న భారత స్టార్ గురువారం ప్రీక్వార్టర్స్‌లో జపాన్ షట్లర్ తొమొక మియాజకీని చిత్తు చేసింది. టాప్ గేర్‌లో రెచ్చిపోయిన తెలుగుతేజం తొలి సెట్‌ను 218తో సునాయసంగా గెలుచుకుంది. రెండో సెట్‌లనూ సింధు ధాటికి ఎనిమిదో సీడ్ తొమొకను 2113తో అలవోకగా మట్టికరిపించింది. సెమీస్ బెర్తు కోసం తను జపాన్‌కే చెందిన మూడో సీడ్ అకనె యమగుజితో తలపడనుంది.పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ ముందే ఇంటిదారి పట్టారు. డబుల్స్‌లో సాత్విక్ - చిరాగ్ జోడీ తిరుగులేని ఆటతో క్వార్టర్స్ చేరింది. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుపొందిన ఈ జంట మలేషియా ఓపెన్‌లోనూ పతకానికి మరింత చేరువైంది. గురువారం జరిగిన 39 నిమిషాల పోరులో జునైదీ అరిఫ్ - రాయ్ కింగ్ యాప్(మలేషియా) జంటను 2118, 2112తో ఓడించింది సాత్విక్ - చిరాగ్ ద్వయం.

ప్రతిపక్షం
www.prathipaksham.in

హైదరాబాద్
శుక్రవారం
09.01.2026

సినిమా

'మన శంకర వర ప్రసాద్ గారు'

ఆల్రెడీ సూపర్ హిట్, ఇది పండగ లాంటి సినిమా

ప్రీరిలీజ్ ఈవెంట్ లో మెగాస్టార్ చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ ''మన శంకర వర ప్రసాద్ గారు' తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఉత్సాహాన్ని మరింత పెంచుతూ విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లు అద్భుతంగా జరుగుతున్నాయి. ట్రైలర్, పాటలు సినిమా పై అంచనాలను భారీగా పెంచాయి. 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మెగా స్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి కేవలం శంకర వరప్రసాద్ దే కాదు.. మొత్తం తెలుగు సినిమా పరిశ్రమది అవ్వాలని కోరుకుంటున్నాను.అన్ని సినిమాలు ఈ సంక్రాంతికి సూపర్ హిట్ అవ్వాలని, తెలుగు చిత్రం పరిశ్రమ సుభిక్షంగా ఉండాలని ఆశిస్తున్నాను.ఈ సినిమా ఆల్రెడీ సూపర్ హిట్ అయిపోయింది. బడ్జెట్ లిమిట్లో చేసాం. డేస్ పరంగా అనుకున్న దాని కంటే తక్కువ రోజుల్లో అత్యద్భుతంగా తీగలిగాం. అనుకున్న బడ్జెట్లో అనుకున్న రోజుల్లో సినిమాచేయగలగడం ఒక సినిమాకి మొదటి సక్సెస్. రెండో విజయం 12 తారీఖున ఎంత ఘన విజయం ఇస్తారనేది ప్రజలు నిర్ణయిస్తారు. నా తమ్ముడు వెంకటేష్ తో సినిమా చేయడం అనేది చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. వెంకటేష్ చాలా పాజిటివ్ పర్సన్. తనతో కూర్చుంటే చాలా ఫిలాసఫికల్ గా అనిపిస్తుంది. మోడరన్ డ్రెస్ వేసుకున్న చిన్న సైజు గురువు లాగా అనిపిస్తుంటాడు. తనతో మాట్లాడుతుంటే చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. మేము చాలా సంవత్సరాల క్రితం అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ ఒక స్టిల్ ఫోటో దిగడం జరిగింది. మనిద్దరం కలిసి ఇలాంటి ఒక సినిమా చేస్తే బాగుంటుందని ఆయన చెప్పారు. అనిల్ ద్వారా ఎన్నాళ్లకు అది కుదిరింది. అనిల్ రావిపూడి మాత్రమే దానికి జస్టిఫికేషన్ చేయగలిగాడు. మా కాంబినేషన్ చాలా అద్భుతంగా వచ్చింది. అది మీరు థియేటర్స్ లో ఎంజాయ్ చేయండి. వెంకీ నేను ఇద్దరం చాలా ఎంజాయ్ చేశాం. ఇది యాక్టింగ్ చేసినలా ఉండదు. ఇద్దరు కుర్రాళ్ళు కలిసి అల్లరి చేసినట్టుగా ఉంటుంది. ఎంత ఊహించుకున్న తక్కువే అవుతుంది. అనిల్ మాట్లాడుతూ మనిద్దరం ఫుల్ లెంత్ ఒక సినిమా చేస్తే బాగుంటుందన్నారు. అలాంటి ఒక కథ రాసుకుంటే మేము చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

భారత సంస్కరణ ఉద్యమాల చరిత్ర నే పూలే సినిమా

నిర్మాత పొన్నం రవిచంద్ర సుపదా క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మించిన 'పూలే'

భారత సంస్కరణ ఉద్యమాల చరిత్రకు మైలు రాయి వంటిదని నిర్మాత సినీ విమర్శకుడు పొన్నం రవిచంద్ర అన్నారు. ఆయన ఈరోజు హైదరాబాదులోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూలే దంపతులు మహిళలందరికీ విద్య నేర్పిన ఆది గురువులని అన్నారు. 200 సంవత్సరాల క్రితం సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే దంపతులు దళితులు స్త్రీలు బహుజనుల పట్ల అప్పటి సమాజ అమానవీయతకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. ఆ సామాజిక ఉద్యమాన్ని తెలుగు నేలపై స్ఫూర్తి నింపడం కోసం హిందీ లో వచ్చిన ఈ సినిమాను తెలుగు లో చేశామని తెలిపారు. సినిమా డైలాగ్ రైటర్ కత్తి చేతన్ మాట్లాడుతూ ఇది వ్యాపారత్మక సినిమా కాదని, సామాజిక సంఘర్షణల కళాత్మక చిత్రమని దీనిని రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యావంతులంతా చారిత్రక దృష్టితో చూడాలని అన్నారు. ఈ సినిమా తెలుగు లో ఒక సంచలమైన సందర్భం అవుతుందని అన్నారు. పూలే సినిమాను ప్రివ్యూ షో చూసి సినిమా టీంని అభినందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్ గారికి మరియు మంత్రివర్గ సభ్యులు శాసనమండలి సభ్యులు శాసనసభ్యులు, దిల్ రాజు లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పొన్నం రవిచంద్ర, కత్తి చేతన్ సివి నవీన్ కుమార్, రాజీవ్ చంద్ర పొన్నంలు తెలిపారు. ఈ సినిమాకు వినోదపు పన్ను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సినిమా భారతీయ సమాజానికి అద్భుతమైన సందేశాన్ని ఇస్తుందని మహిళా అభ్యున్నతికి ఆనాడు ఉన్న కుల వివక్షకు వ్యతిరేకంగా సర్వ సమానత్వ భావన కోసం జరిపిన త్యాగాలను ఈ తరానికి గుర్తు చేస్తుందని వారు అన్నారు. తెలుగు సమాజంలో బహుజన రాజకీయ అధికారానికి బాటలు వేస్తుందన్నారు. ఇది హిందీ లో అనంత మహదేవన్ దర్శకత్వంలో పూలే దంపతుల సంపూర్ణ బయోగ్రఫీ చిత్రమని ఇందులో ప్రతిక్ గాంధీ, పత్రలేఖ పాల్ ల నటన అద్భుతమని అన్నారు. ఈ సినిమా సెన్సార్ బోర్డ్ పరిశీలన తర్వాత ఈ జనవరి చివరి వారంలో అన్ని థియేటర్లలో రిలీజ్ చేస్తామన్నారు. మనం ఇప్పుడు ఈ ఆధునిక ప్రజాస్వాముక సమాజంలో ఉన్నామంటే పూలే అంబేద్కర్ లాంటి దార్శానిక విప్లవకారులే కారణమన్నారు. ఈ సమావేశంలో తిరుపతి గౌని, ఉదయ్ కుంభం, జనని, నేతికార్ సురేష్ లాల్, అభినవ్ వరాల, నీలం రమేష్ పాల్గొన్నారు.

దేఖో 'విష్ణు విన్యాసం'

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' అనే యూనిక్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతి రావు ఈ చిత్రానికి దర్శకత్వం. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రాన్ని హేమ, షాలిని సమర్పిస్తున్నారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామచారి ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ జర్నీని ప్రారంభించింది. ఫస్ట్ సింగిల్ 'దేఖో విష్ణు విన్యాసం'ను విడుదల చేశారు. ఈ సరదా పాట కథానాయకుడికి జ్యోతిష్యంపై ఉన్న పిచ్చిని ప్రజెంట్ చేస్తోంది. ప్రతి బీట్, ప్రతి పదం, ప్రతి ఎక్స్‌ప్రెషన్ విష్ణు పాత్ర జాతకాలను జీవితానికి మార్గదర్శకంగా ఎలా భావిస్తుందో తెలియజేస్తాయి. రథన్ అందించిన మ్యూజిక్, రామజోగయ్య శాస్త్రి చమత్కారమైన సాహిత్యం, శ్రీకృష్ణ పవర్ ఫుల్ వోకల్స్ ఈ పాటను మూఢనమ్మకాలపై ఒక సరదా వేడుకగా మార్చాయి. నయన సారిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళి శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రాకింగ్ స్టార్ యశ్ బర్త్ డే స్పెషల్..

'టాక్సిక్'లో పవర్‌ఫుల్ 'రాయ'

రాకింగ్ స్టార్ యశ్ పుట్టినరోజును సందర్భంగా ఆయన హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' నుంచి ఆయన సినిమాలో చేస్తోన్న క్యారెక్టర్ ఇంట్రో టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్‌తో యష్ నటించిన రాయ పాత్ర పవర్‌ఫుల్‌గా, బోల్డ్‌గా ఉంది. ఫస్ట్ ఫ్రేమ్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేలా ఈ టీజర్‌ను రూపొందించారు. అభిమానులు, సినీ వర్గాలు భారీ అంచనాలతో ఈ సినిమా కోసం వెయిట్ చేస్తోన్న నేపథ్యంలో రాయ పాత్రకు సంబంధించిన క్యారెక్టర్ ఇంట్రో సెలబ్రేషన్స్‌లా కాకుండా ఓ స్టేట్‌మెంట్‌లా ఉంది. గమనించాల్సిన విషయమేమంటే.. టాక్సిక్ సినిమాలో తన పాత్ర కంటే ముందు టాక్సిక్ సినిమాలో నటిస్తోన్న ఇతర హీరోయిన్స్ పాత్రలకు సంబంధించిన లుక్స్‌ను విడుదల చేశారు. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేష్, రుక్మిణి వసంత్, తారా సుతారియా ఇందులో డిఫరెంట్ రోల్స్‌లో కనిపించబోతున్నారు. ప్రతి పాత్రకు ఓ ప్రాధాన్యం ఉంటుందని దీని ద్వారా తెలియజేశారు. టాక్సిక్ కేవలం భారీ బడ్జెట్ తో రూపొందే సినిమాయే కాకుండా .. ప్రతి పాత్ర పవర్‌ఫుల్‌గా కథను ముందుకు తీసుకెళ్లా ఉంటుందని తెలియజేశారు. అందులో భాగంగా పత్రీ పాత్రను విడుదల చేసి హైప్‌ను పెంచిన మేకర్స్ సినిమాలో మెయిన్ క్యారెక్టర్ అయిన రాయ వంటి పవర్‌ఫుల్ పాత్రను పరిచయం చేశారు.చాలా మంది రిస్క్ అని భావించిన ప్రాజెక్ట్సే సరికొత్త నిర్వచనాన్ని సృష్టించాయి. అదే పంథాలో సేఫ్టీ విజన్‌తో సినిమాలు చేయాలనే ఆలోచనతో కాకుండా ఓ లక్ష్యంతో ముందుకు వెళ్లాలనే దానికి ప్రాధాన్యతనిస్తుంటాడు యష్. టాక్సిక్‌తో మరోసారి అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు రాకింగ్ స్టార్.నటుడిగానే కాకుండా ఈ సినిమాతో యశ్ సహ రచయిత, నిర్మాతగానూ మారారు. తనదైన ఆలోచనతో కొత్త ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. అందులో భాగంగా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో అంతర్జాతీయ స్థాయిలో సినిమాను రూపొందించటానికి సిద్ధమయ్యారు. గత ఏడాది యశ్‌పుట్టినరోజు సందర్భంగా వచ్చిన గ్లింప్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఈసారి వచ్చిన వీడియో టాక్సిక్ ప్రపంచాన్ని డిఫరెంట్ కథనం, విజువల్స్‌తో మరింత విస్తృతంగా, లోతుగా ఆవిష్కరించేలా కనిపిస్తోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200